Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 154 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)
గురువారం, 25 - 12 - 2025
94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

## బాహుబలి రాకెట్ ప్రయోగం సక్సెస్.. మోదీ రియాక్షన్



**న్యూఢిల్లీ :** శ్రీహరికోటలోని సతీష్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి బుధవా రం ప్రయోగించిన బాహుబలి రాకెట్ ఎల్‌వీఎం3- ఎం6 ప్రయోగం విజయవంతమైంది. అమెరికాకు చెందిన అధునాతన కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్ 2ను ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశ పెట్టింది. ఈ ప్రయోగం విజయవంతం కావడంపై దేశంలోని పలువురు ప్రముఖులు స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తమ ఎక్స్ ఖాతాల వేదికగా వేర్వేరుగా స్పందించారు. ప్రధాని మోదీ స్పందిస్తూ.. భారతదేశ యువత శక్తితో.. మన అంతరిక్ష రంగం మరింత అభివృద్ధి చెందుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇది ప్రభావవంతంగా మారుతోందని ఆయన ఆకాంక్షించారు. ఎల్‌వీఎమ్ 3 నమ్మకమైన హెవీ లిఫ్ట్ పనితీరును కనబరుస్తుందన్నారు. గగన్‌యాన్ వంటి భవిష్యత్ మిషన్ల కోసం బలమైన పునాదులు వేస్తున్నామని తెలిపారు. అలాగే వాణిజ్య ప్రయోగ సేవలను సైతం విస్తరిస్తున్నామని పేర్కొన్నారు. ప్రపంచ భాగస్వామ్యంతో ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఇది భవిష్యత్తు తరాల సామర్థ్యంతో పాటు స్వావలంబను మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

**ఇస్రో బృందానికి అభినందనలు: సీఎం చంద్రబాబు**

శ్రీహరికోట నుంచి ఎల్‌వీఎమ్3- ఎమ్6ను బుధవారం ఇస్రో విజయవంతంగా ప్రయోగించింది. ఈ సందర్భంగా ఇస్రో బృందానికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుభా కాంక్షలు తెలిపారు. యూఎస్ కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూబర్డ్ బ్లాక్ 2 మోసుకెళ్లి.. అందుకు నిర్దేశించిన కక్ష్యలో ఈ ఉపగ్రహం ఉంచిందన్నారు. భారత్ నేలపై నుంచి ఇప్పటివరకు అత్యంత బరువైన ఉప్రగ్రహాన్ని ప్రయోగించలేదని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు. తాజాగా ఈ ఉపగ్రహాన్ని ప్రయోగించడం ద్వారా మన దేశ వాణిజ్య అంతరిక్ష సామర్థ్యం, ప్రపంచ ప్రయోగ భాగస్వామిగా దాని స్థానాన్ని మరింత బలోపేతం చేస్తుందని తెలిపారు. ఈ అద్భుతమైన మిషన్ విజయానికి దోహదపడిన శాస్త్రవేత్తలు, ఇంజనీర్లకు ఇలా ప్రతి ఒక్కరికీ సీఎం చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు.

## స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానంలో సేవలందించాలి : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** స్వర్ణాంధ్ర లక్ష్యాలు, పది సూత్రాల అమలుపై ఏపీ సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. సచివాలయంలో నిర్వహించిన ఈ సమావేశానికి సీఎస్ విజయానంద్‌తో పాటు జలవనరులు, రెవెన్యూశాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానంలో వేగంగా పౌరులకు మెరుగైన సేవలు అందించేలా కార్యాచరణ రూపొందించాలని చంద్రబాబు స్పష్టం చేశారు.సుస్థిరాభివృద్ధితో పాటు స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు నిర్దేశించుకోవాల్సిన అంశాలపై అధికారులతో సీఎం చర్చించారు. ప్రభుత్వ శాఖల మధ్య మెరుగైన సమన్వయం, తక్కువ వ్యయంతో ఇంధనం, విద్యుత్, రవాణా, నీటి భద్రత అందించటమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. జీరో పావర్టీ, మానవ వనరుల అభివృద్ధి, ఉద్యోగాల కల్పన, సాంకేతికత మేళవింపు తదితర అంశాల ఆధారంగా లక్ష్యాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నింగిలోకి దూసుకెళ్లిన ఎల్వీఎం-3 ఎం-6

**తిరుపతి, (రాజధాని వార్తలు):** భారతీయ అంతరిక్ష పరిశోధనా సంస్థ ప్రస్థానంలో మరో మైలురాయి చేరింది. బుధవారం ఉదయం 8:54 గంటలకు ఎల్వీఎం-3 ఎం-6 రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించింది ఇస్రో. శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్-షార్ నుంచి అమెరికాకు చెందిన కొత్త తరం కమ్యూనికేషన్ ఉపగ్రహం బ్లూ బర్డ్ బ్లాక్-2ను కక్ష్యలోకి పంపారు. 6,400 కిలోల బరువుగల ఈ భారీ ఉపగ్రహాన్ని మోసుకెళ్లే క్రమంలో నిప్పులు చిమ్ముకుంటూ నింగిలోకి ఎగిసింది LVM-3 M-6 రాకెట్. నిర్దేశిత కక్ష్యలో15.07 నిమిషాల్లో రాకెట్ మూడు దశలు పూర్తవగానే లో ఎర్త్ ఆర్బిట్ (లియో)లోకి ఉప గ్రహాన్ని ప్రవేశపెట్టనుంది. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్ మొబైల్ సంస్థతో సంయుక్తంగా ఈ ప్రయోగాన్ని నిర్వహించింది ఇస్రో వాణిజ్య విభాగం న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్. ఈ వాణిజ్య ప్రయోగంతో తన బాహుబలి రాకెట్ ద్వారా ఇస్రో సరికొత్త రికార్డు నెలకొల్పనుంది.




## రుషికొండపై కేబినెట్ సబ్ కమిటీ మరోసారి భేటీ.. ఏం తేల్చారంటే...



**అమరావతి, (రాజధాని వార్తలు):** విశాఖ రుషికొండ ప్యాలస్‌పై మంత్రి వర్గ ఉపసంఘం సమావేశం జరిగిందని...హాస్పిటాలిటీ ఇండస్ట్రీకి ప్యాలెస్‌ను ఇచ్చే అంశంపై పరిశీలించినట్లు మంత్రి పయ్యా వుల కేశవ్ తెలిపారు. కానీ కొంతమంది హోటల్ కోసం అదనపు స్థలం కావాలని అడిగారని చెప్పారు. రుషికొండ కింద ఉన్న 9 ఎకరాలు స్థలంలో ఏడు ఎకరాలు సీఆర్‌జెడ్ నిబంధనలోకి వస్తాయని.. ఆ 7 ఎకరాల్లో ఎలాంటి నిర్మాణం చేయకూడదన్నారు. తమకు ఇదో సవాల్‌గా మారిందన్నారు. ఎల్లుండి మరోసారి సమావేశం అవ్వనున్నట్లు చెప్పారు. రుషికొండ నిర్మాణాలపై మళ్ళీ నిర్మా ణాలు చేసే అవకాశం ఉందని.. పైన రెండు ఫ్లోర్లు వేసుకునే అవకాశం ఉందన్నారు. రుషికొండ చివరి రెండు బ్లాక్‌లు ప్రజలకు, సాం స్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు, టూరిస్ట్ అవసరాల కోసం ఉం చుతామని చెప్పారు. తాజ్ గ్రూప్, లీలా హోటల్ గ్రూప్, అట్మాస్ఫియర్ కోర్ వంటి గ్రూప్ హోటల్స్ ముందుకు వచ్చాయని మంత్రి పయ్యవుల కేశవ్ పేర్కొన్నారు.

**ఇదంతా వారి వల్లే: మంత్రి కందుల**

రుషికొండపై ఇప్పుడు తలబద్దలు కొట్టుకోవడానికి ఆనాటి ప్రభుత్వమే కారణమని ఏపీ టూరిజం శాఖా మంత్రి కందుల దుర్గేష్ విమర్శించారు. ఆదాయం వచ్చే భవనాలు కూల్చి ప్యాలెస్ కట్టారని మండిపడ్డారు. మరోసారి రుషికొండ వినియోగంపై చర్చ జరుగుతుందన్నారు. అనేక ప్రపోజల్స్ వస్తున్నాయని.. వైబుల్ ప్రాజెక్ట్ ఏంటి అనే అంశంపై దృష్టి పెట్టామని తెలిపారు. సముద్రం ఆటుపోట్ల వల్ల రుషికొండ కింద 9 ఎకరాల్లో 2 ఎకరాలు మాత్రమే అందుబాటులోకి వస్తాయన్నారు. ఏడు ఎకరాలు సీఆర్ జెడ్ నిబంధనల పరిధిలోకి ఉంటాయని మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. కాగా.. రుషికొండ ప్యాలెస్‌ను ఎలా వినియోగించాలన్న అంశంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీ 3వ భేటీ బుధవారం జరిగింది. సచివాలయంలో జరిగిన ఈ సమావేశంలో మంత్రులు పయ్యావుల కేశవ్, కందుల దుర్గేష్, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీ టీఏ సీఈఓ ఆమ్రపాలి కాట, పర్యాటక శాఖ అధికారులు పాల్గొనగా...మంత్రి మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి వర్చువల్‌గా పాల్గొన్నారు.

## సిల్వర్ మెడల్ గెలుచుకోవడంపై శశాంక్‌కు చంద్రబాబు అభినందనలు



**అమరావతి, (రాజధాని వార్తలు):** రాష్ట్రానికి చెందిన ఈక్వేస్టేరియన్ ఈవెటింగ్ క్రీడాకారుడు శశాంక్ కనుమూరి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుని కలిశారు. థాయ్ పోలో క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన ఈవెంటింగ్ ఏషియన్ ఛాంపియన్ షిప్-2025లో భారత్ తరుపున పాల్గొన్న శశాంక్ టీం సిల్వర్ మెడల్ గెలుచుకోవడంపై సిఎం చంద్రబాబు అభినందించారు. గుర్రాలతో హర్డిల్స్ దాటే ఈక్వేస్టేరియన్ ఈవెంటింగ్ క్రీడలో తనకు పదేళ్ల అనుభవం ఉందని క్రీడాకారుడు శశాంక్ ముఖ్యమంత్రికి తెలిపారు. భారత్ తరుపున పాల్గొన్న తమ టీంకు సిల్వర్ మెడల్ వచ్చిందని శశాంక్ వివరించారు. భీమవరానికి చెందిన శశాంక్ కనుమూరి మరింతగా రాణించాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు.


## రూ.12,015 కోట్లతో ఢిల్లీ మెట్రో విస్తరణ.. కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయం



**న్యూఢిల్లీ:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం నాడు జరిగిన కేంద్ర కేబినెట్ సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఢిల్లీ మెట్రో ఫేజ్ 5(ఏ) విస్తరణకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ. 12,015 కోట్లు కేటాయించారు. 13 కొత్త స్టేషన్లను కలుపుతూ 16 కిలోమీటర్ల మేరకు ఈ విస్తరణ పనులు చేపడతారు. దీంతో రాబోయే మూడేళ్లలో ఈ ర్యాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ నెట్‌వర్క్ 400 కిలోమీటర్ల మార్క్‌ను చేరనుంది. ఫేజ్ 5 (ఏ)లో భాగంగా 16 కిలోమీటర్ల మేర 3 నూతన కారిడార్లను ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ (డీఎంఆర్‌సీ) నిర్మించనున్నట్టు కేబినెట్ సమా వేశానంతరం కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మీడియాకు తెలిపారు. ఢిల్లీ మెట్రో చరిత్రలో ఇదొక మైలురాయని చెప్పారు. ఈ ప్రాజెక్టుతో 33,000 టన్నుల కర్బన ఉద్గారాలను తగ్గించవచ్చని, రాబోయే మూడేళ్లలో ఈ ప్రాజెక్టు పూర్తవుతుందని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ఢిల్లీ మెట్రో ఆపరేషనల్ లెంగ్త్ 400 కిలోమీటర్లను అధిగమిస్తుందని, ప్రపంచంలోనే అతి పెద్ద అర్బన్ రైల్ నెట్‌వర్క్‌గా నిలుస్తుందని వివరించారు.

## పాస్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్ కానుక

### - 8,418 మంది పాస్టర్లకు రూ.50.50 కోట్లు విడుదల




**అమరావతి, (రాజధాని వార్తలు):** పాస్టర్లకు కూటమి ప్రభుత్వం క్రిస్మస్ కానుకను అందించింది. పాస్టర్లకు నెలవారీ అందించే గౌరవ వేతనాలను జమ చేసింది. 24వ తేదీ సాయంత్రంలోపు గౌరవ వేతనాలు చెల్లిస్తామని సెమీ క్రిస్మస్ రోజున ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలోని 8,418 మంది పాస్టర్లకు గౌరవ వేతనం నిధులు బుధవారం విడుదల చేశారు. 2024 డిసెంబర్ నుంచి ఈ ఏడాది నవంబర్ వరకు మొత్తం రూ. 50.50,80,000ను రాష్ట్ర ప్రభుత్వం పాస్టర్ల ఖాతాలో వేసింది. దీంతో ఒక్కో పాస్టర్‌కు నెలకు రూ. 5,000 చొప్పున ఒకొక్కరికి 12 నెలల మొత్తం రూ. 60,000 అందించింది.

## అనుమానం ఎంత పని చేసింది... స్క్రూ డ్రైవర్‌తో భార్యను

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** అనుమానం పెనుభూతం అంటారు. భార్యా/భర్త మనసులో ఒక్కసారి అనుమానం అనే బీజం పడితే.. అప్పటి వరకు సజావుగా సాగిన కాపురాలు కుప్పకూలిపోతాయి. అనుమానంతో దంపతుల మధ్య తరచూ గొడవలు జరుగుతూనే ఉంటాయి. చిన్న గొడవ అయితే పర్వాలేదు.. కానీ అది చిలికి చిలికి గాలి వానగా మారితే మాత్రం పెను ఉపద్రవాలకు దారి తీసే అవకాశం ఉంటుంది. అనుమానం అనే రోగంతో కట్టుకున్న భార్యను నానా హింసలకు గురి చేస్తున్న వారు ఎందరో. అలాగే అనుమానంతో భార్యలు చేతిలో నలిగిపోతున్న భర్తలు కూడా ఉన్నారు. మరికొందరు అయితే విచక్షణ మరిచి తమ అర్ధాంగిని కడతేర్చిన ఘటనలు కూడా అనేకం ఉన్నాయి. ఇప్పుడు తాజాగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనకపాల్లి జిల్లాలో కూడా ఇలాంటి ఘటనే చోటు చేసుకుంది. కడదాగా తోడుండాల్సిన భర్తే.. భార్యను అతి కిరాతంగా హత్య చేశాడు. వివరాల్లోకి వెళితే... జిల్లాలోని ఎలమం చిలి పట్టణంలో అనుమానంతో భార్యను భర్త దారుణంగా హత్య చేశాడు. ఉత్తరాఖండ్ రాష్ట్రానికి చెందిన దంపతులు బతుకుతెరువు కోసం ఎలమంచికి వచ్చారు. ఆ దంపతులు పాత ఇనుము దుకా ణాన్ని లీజుకు తీసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే భార్య తరచూ ఫోన్‌లో మాట్లాడుతుండడాన్ని గమనించిన భర్త ఆమెను మందలించాడు. ఈ విషయంపై తరచూ ఇద్దరి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఫోన్‌లో మాట్లాడటాన్ని భార్య కొనసాగించడంతో ఆగ్రహంతో ఊగిపోయిన భర్త.. ఆమెను అతి కిరాతకంగా స్క్రూ డ్రైవర్‌తో పొడిచి హత్య చేశాడు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలిం చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టిస్తోంది.

## గత ప్రభుత్వ అవినీతి ఒక్కొక్కటిగా బయటకు వస్తుంది : మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి

**అమరావతి, (రాజధాని వార్తలు):** జగన్ ప్రభుత్వ హయాంలో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ)లో అనేక అవినీతి కార్యక్రమాలు జరిగాయని.. అన్ని ఒక్కొక్కటిగా బయటకు వస్తున్నాయని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. బుధవారం అమరావతిలో మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ.. స్వామి వారి లడ్డు ప్రసాదం తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యి వ్యవహారంలో సైతం సంచలన విషయాలు బయటకు వస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చే భక్తులనే కాకుండా.. దేశవిదేశాల నుంచి వచ్చే భక్తులను కూడా అనేక ఇబ్బందులకు గురి చేశారని విమర్శించారు. అంతేకాదు.. తిరుమల వచ్చే భక్తులకు సౌకర్యాల కల్పించే విషయంలో కూడా గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిం చిందంటూ మండిపడ్డారు. టీటీడీ చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో అనేక అక్రమాలు జరిగాయని ఆరోపించారు. నేడు ఆయన నేడు బయటకు వచ్చి ఎటువంటి అక్రమాలు జరగలేదని చెప్తున్నాడంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ప్రభుత్వ పాలనలో అన్నప్రసాదంలో కానీ, వసతి విషయంలో కానీ అక్రమాలన్నీటిని బయటకు తీస్తు న్నామని మంత్రి జనార్ధన్ రెడ్డి వివరించారు. డిసెంబర్ 30వ తేదీన వైకుంఠ ఏకాదశి అని..ఆ రోజు 90 శాతానికి పైగా సామన్య భక్తులకు సౌకర్యాలు కల్పించాలనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని చెప్పారు.

# జేఈఈ మెయిన్స్ రాష్ట్ర స్థాయి టాలెంట్ టెస్ట్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** స్థానిక బాలాజీ నగర్ నారాయణ ఒలింపియాడ్, ఈ–టెక్నో స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి టాలెంట్ టెస్ట్‌లో సత్తా చాటారు. విద్యార్థులు 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు నిర్వహించిన జేఈఈ మెయిన్స్ స్టేట్ లెవెల్ పరీక్షలో అసాధారణ ప్రతిభను ప్రదర్శించి రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్‌ను సాధించారు. ఈ పరీక్షలో పాల్గొన్న నారాయణ విద్యార్థులు 300కి 300 మార్కులతో 14 మంది విద్యార్థులు పూర్తి మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభను కనబరిచారు. ఈ సందర్భంగా నారాయణ విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల ఈ ఘన విజయం నారాయణ విద్యా సంస్థల బలమైన అకాడెమిక్ విధానం, నాణ్యమైన బోధన, క్రమశిక్షణతో కూడిన శిక్షణకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఈ విజయం భవిష్యత్తులో జాతీయ స్థాయిలో మరిన్ని గొప్ప విజయాలకు పునాది కావాలని ఆకాంక్షించారు. ఈ విజయోత్సవ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వందన, అకాడెమిక్ డీన్ సురేంద్ర, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని, విజేతలను అభినందించారు.

# సరికొత్త ఆలోచనలతో నుడాకు ప్రత్యేక గుర్తింపు

## - ఒక బ్రాండ్ ఇమేజ్‌గా నుడా ఎదగాలి : జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల





**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో నెల్లూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (నుడా)కి ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా సరికొత్త ఆలోచనలతో, వినూత్నంగా పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నుడా అధికారులకు సూచించారు. మంగళవారం నెల్లూరు నగరంలోని వేదాయపాలెంలో గల నుడా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నుడా అథారిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ మొగిలి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. తొలిసారిగా నుడా కార్యాలయానికి విచ్చేసిన కలెక్టర్‌కు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అజెండాలోని పలు అంశాలపై కమిటీ సభ్యులు చర్చించి ఆమోదం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నుడా పరిధి వేగంగా విస్తరిస్తోందని, నుడా పరిధిలో అనేక పరిశ్రమలు ఏర్పాటవుతున్నాయని తెలిపారు. దీంతో ఆయా ప్రాంతాల్లో గృహ సముదాయాలు, పాఠశాలలు, హాస్పిటల్స్, మాల్స్ వంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చెందనున్నాయని చెప్పారు. ఈ మొత్తం అభివృద్ధి ప్రక్రియలో నుడా పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు పొందేలా ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులను నుడా చేపట్టాలని సూచించారు. ఎంఐజి హౌసింగ్ ప్రాజెక్టులతో పాటు పెద్ద నగరాల్లో ఉన్న వండర్‌లా, వాటర్ పార్కులు, అడ్వెంచర్ పార్కులు వంటి వినోదాత్మక ప్రాజెక్టులను అభివృద్ధి చేసి నుడా అంటే ప్రజల్లో ఒక బ్రాండ్ ఇమేజ్ ఏర్పడేలా సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ ప్రాజెక్టులను పిపిపి పద్ధతిలో చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ, తాను రెండోసారి నుడా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టానని, చిరకాలం నిలిచిపోయే అభివృద్ధి పనులు చేపట్టాలన్నదే తన ఆశయమని తెలిపారు. ఇందుకు కలెక్టర్ సహాయసహకారాలు అందించాలని కోరారు. ఎన్‌టిఆర్ నెక్లెస్ రోడ్డు, నెల్లూరు రింగ్ రోడ్డు ఏర్పాటుకు సహకారం అందించాలని కలెక్టర్‌ను విజ్ఞప్తి చేశారు. నుడా పరిధిలో కొన్ని భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, కొన్ని చోట్ల భూ సమస్యలు ఉన్నాయని కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ నెల్లూరు రింగ్ రోడ్డు డిజైన్లు, ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, మరో సమావేశంలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించి నుడాకు అప్పగించాలని నుడా వైస్ చైర్మన్‌ను ఆదేశించారు. నుడా అభివృద్ధికి ప్రభుత్వ పరంగా అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో నుడా కార్యదర్శి అల్లంపాటి పెంచల్‌రెడ్డి, ప్లానింగ్ అధికారులు హిమబిందు, కాలేషా, ఏవోలు హేమలత, ఈశ్వర్‌రాజు, ఈఈ చంద్రయ్య, విద్యుత్ శాఖ ఎస్ఈ రాఘవేంద్రన్, టూరిజం అధికారి ఉషశ్రీతో పాటు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# బాల సుధాకర్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని స్థానిక ప్రగతి నగర్ ఏ బ్లాక్ నందు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పిసిసి మెంబర్ నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు తలారి బాల సుధాకర్ ఆధ్వర్యంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు, పేదలకు చీరలు దుప్పట్లు పంపిణీ నిర్వహించి తదనంతరం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సాల్వేషన్ ఆర్మీ చర్చికి చెందిన డివిజనల్ కమాండర్ జోసెఫ్, సుశీల, పాస్టర్లు ప్రశాంత్, జ్యోతి, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తలారి బాల సుధాకర్ కుటుంబ సభ్యులు, కుమార్తెలు, అల్లుళ్లు, సోదరులు సహకరించారు. ఈ సందర్భంగా బాల సుధాకర్ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని



నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. అలాగే క్రిస్మస్ శుభాకాంక్షలు అందరికీ తెలియజేశారు.

# సాల్వేషన్ ఆర్మీ సేవలను విస్తృత పరచి పేదలకు మరింత సేవలను అందించాలి : కలెక్టర్ హిమాన్షు శుక్లా




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని మంగళవారం స్థానిక దర్గా మిట్టలోని డి.హెచ్.క్యూ ప్రాంగణంలో సాల్వేషన్ ఆర్మీ తరపున జీసెస్ జన్మదినం సందర్భంగా పేదలకు చీరలు, బ్లాంకెట్‌లు పంపిణీ కార్యక్రమములో ముఖ్య అతిధిగా పాల్గొని పేదలకు చీరలు, బ్లాంకెట్ పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాల్వేషన్ ఆర్మీ పేదలకు చేసే సేవలో తమ వంతు సహాకారం ఉంటుందన్నారు. సీతా కాలములో పేదలకు బ్లాంకెట్లు పంచడం మంచి పరిణామని అన్నారు. క్రైస్తవ సోదర, సోదరీ మణులు ప్రేమానురాగాలతో క్రిస్మస్ వేడుకలను అందరూ ఘనంగా నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమములో సాల్వేషన్ ఆర్మీ డివిజినల్ కమాండర్ డి.జొసెఫ్, వారి సతీమణి సుసీలమ్మ, డివిజినల్ సెక్రెటరీ కలు జయ కుమార్, రత్నం, పాస్టర్లు ప్రశాంత్ కుమార్, జ్యోతి, కోర్ సెక్రటరీ టి.బాల సుధాకర్ మరియు టి.విజయ కుమార్, భారతి, తదితరులు పాల్గొన్నారు.

# ఉత్సాహంగా సాగుతున్న నారాయణ ప్రీమియర్ లీగ్ పోటీలు






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నారాయణ ప్రీమియర్లీగ్ పోటీల కార్యక్రమంలో భాగంగా నారాయణ మెడికల్ కాలేజీ గ్రౌండ్‌లో నిర్వహించిన క్రీడా కార్యక్రమాలలో నారాయణ స్కూల్ బాలాజీ నగర్ మరియు నారాయణ స్కూల్ స్టోన్ హౌస్ పేటకు చెందిన 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులు వివిధ ఆటలలో పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శిస్తూ, ఉత్సాహభరిత ప్రదర్శనలతో హాజరైన వారందరినీ అలరించారు.

చిన్నారుల చురుకుదనం, క్రీడా నైపుణ్యం, జట్టు భావన కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్ర మంలో ప్రిన్సిపాల్ వందన, పెంచలప్రసాద్, కోర్డినేటర్ శాంతి మరియు పిఇటిలు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. క్రీడలు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎంతగానో దోహదపడతాయని వారు తెలిపారు.

# "సెమి క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న కాకాణి"






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా క్రిస్టియన్ విభాగం అధ్యక్షులు కాళహస్తి భవన్ అనుదీప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలలో శాసనమండలి సభ్యులు మేరిగ మురళీధర్ ఇతర నాయకులు, పాస్టర్లతో కలిసి పాల్గొని, కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ మంత్రి వర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. క్రీస్తు ప్రభువు సందేశాన్ని చదివి వివరించడంతో పాటు, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించిన పాస్టర్లు. ప్రజలందరికీ ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేసిన కాకాణి. ప్రభువు ఏసుక్రీస్తు జననం సందర్భంగా క్రిస్మస్ వేడుకలు ప్రపంచ వ్యాప్తంగా అందరూ ఘనంగా జరుపుకునే పండుగ. ప్రభువు ఏసుక్రీస్తు చూపించిన శాంతి సందేశం ప్రపంచ మానవాళికి ఆచరణీయం. దాదాపు 10 రోజుల ముందు నుండి పండుగ వాతావరణంలో క్రిష్టియన్ సోదరులు జరుపుకుంటున్న ఏసు క్రీస్తు ప్రభువు జన్మదిన వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. ఏసుక్రీస్తు చూపిన మార్గాన్ని అనుసరిస్తూ క్రిస్టియన్ సోదరులు శాంతికపోతాలుగా సమాజంలో వ్యవహరిస్తున్నారు. ప్రభువు ఏసుక్రీస్తు జీవితం పక్కవారికి సహాయం చేస్తూ, శాంతి మార్గంలో ఏ విధంగా నడుచుకోవాలో చెబుతుంది. నేటి సమాజంలో ప్రభువు చూపించిన శాంతి మార్గాన్ని మానవాళికి చూపించే బాధ్యతను పాస్టర్లు తీసుకోవాలి. నేడు సమాజంలో యువత తప్పుదోవ పట్టడంతో, హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయి. ప్రభువు ఏసుక్రీస్తు లాంటి మహనీయుల సందేశాలతో మార్పు తీసుకొని వచ్చి, అందరూ శాంతి మార్గాన్ని అనుసరించేలా పాస్టర్లు కృషి చెయ్యాలి. రాజకీయాలలో, కులం, మతం, వ్యక్తిత్వాన్ని సైతం వాడుకుంటున్నారు. జగన్మోహన్ రెడ్డి తన మతం మానవత్వమని స్పష్టం చేశారు. జగన్మోహన్ రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పాలనను అందించి, అందరి మనసుల్లో తనదైన ముద్రను పెనవేసుకున్నారు. జగన్మోహన్ రెడ్డి ద్వారా లబ్ధి పొందిన కుటుంబాలు ఊరూరా, వాడవాడలా, ప్రపంచ వ్యాప్తంగా పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం అన్ని వర్గాలకు ఆయన చేసిన మేలుకు నిదర్శనం. ప్రభువు ఏసుక్రీస్తు ఆశీస్సులు జగన్మోహన్ రెడ్డిపై ఉండాలని, మీ అందరి ప్రార్థనలతో జగన్మోహన్ రెడ్డి తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటూ, క్రిస్టియన్ సోదర, సోదరీమణులకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు.

# విక్రమ సింహపురి వర్సిటీలో "డిజిటల్ కంటెంట్ స్ట్రాటజీ"పై ప్రత్యేక సదస్సు

## - వెబ్ రైటింగ్, సోషల్ మీడియా మెలకువలపై విద్యార్థులకు శిక్షణ






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఆంగ్ల విభాగం ఆధ్వర్యంలో మంగళవారం "డిజిటల్ కంటెంట్ స్ట్రాటజీ" అనే అంశంపై ఒక రోజు ప్రత్యేక కార్యశాల ఘనంగా జరిగింది. పీఎం–ఉషా సహకారంతో నిర్వహిస్తున్న 12 రోజుల "క్రియేటివ్ రైటింగ్ మరియు ప్రొఫెషనల్ కంటెంట్ డెవలప్‌మెంట్" సర్టిఫికేట్ కోర్సులో భాగంగా 7వ రోజు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు.

నిపుణుల ప్రసంగం – ముఖ్యాంశాలు:

ఈ సదస్సుకు ముఖ్య వక్తగా కందుకూరు టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంగ్ల ఉపన్యాసకులు డా.పి.రాజు గోపాల బాబు హాజరయ్యారు. డిజిటల్ యుగంలో రచనల తీరుతెన్నుల గురించి ఆయన విద్యార్థులకు వివరిస్తూ ఈ కింది అంశాలపై అవగాహన కల్పించారు:

వెబ్ రైటింగ్ : ఇంటర్నెట్ పాఠకుల మనస్తత్వం, ఆన్ లైన్‌లో చదివే పద్ధతులు మరియు సాంకేతిక అంశాలను వివరించారు.

F-Pattern రీడింగ్: పాఠకులు స్క్రీన్‌పై కంటెంట్‌ను చదివేటప్పుడు అనుసరించే 'F-pattern' గురించి, మైక్రో–కాపీ యొక్క ప్రాముఖ్యత గురించి సోదాహరణంగా వివరించారు.

సోషల్ మీడియా డైనమిక్స్: లింక్డ్ఇన్, ఎక్స్ మరియు ఇన్‌స్టాగ్రామ్ వంటి వివిధ ప్లాట్‌ఫారమ్‌లకు అనుగుణంగా కంటెంట్‌ను ఎలా మలచుకోవాలో, ఎంగేజ్‌మెంట్ మెట్రిక్స్‌ను ఎలా విశ్లేషించుకోవాలో తెలియజేశారు.

ప్రాక్టికల్ సెషన్ – కంటెంట్ క్యాలెండర్:

మధ్యాహ్నం జరిగిన సెషన్‌లో విద్యార్థులకు ఆచరణాత్మక శిక్షణ ఇచ్చారు. ఇందులో భాగంగా విద్యార్థులు ఒక బ్రాండ్ కోసం "సోషల్ మీడియా కంటెంట్ క్యాలెండర్"ను రూపొందించారు. అనంతరం విద్యార్థులు తాము రూపొందించిన వ్యూహాలను ప్రదర్శించారు.

ఈ కార్యక్రమాన్ని పీఎం–ఉషా యాక్టివిటీ కోఆర్డినేటర్ & ఆర్గనైజింగ్ సెక్రటరీ డా.బి.ఎస్.ఎస్. భగవాన్ మరియు కో–కోఆర్డినేటర్ డా.ఆర్.ప్రభాకర్ పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గెస్ట్ ఫ్యాకల్టీ సభ్యులు డా.బి.శామ్యూల్ మార్క్, వి.భాగ్య జోత్స్న, టి. పాల్ ఆర్మ్‌స్ట్రాంగ్, పరిశోధక విద్యార్థులు మరియు పీజీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

# శ్రీశ్రీశ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానంలో ఉచిత వైద్య శిబిరం






**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు నగరంలోని నవాబ్ పేట శ్రీ శ్రీ మహాలక్ష్మమ్మ అమ్మవారి దేవస్థానం నందు మంగళవారం విశ్వమాత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ మరియు మెడికవర్ హాస్పిటల్ సహాయ సహకారాలతో ఉచిత కంటి పరీక్షలు అవసరం అయిన వారికి ఉచిత ఆపరేషన్లు చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా విశ్వమాతా సేవ ఫౌండేషన్ ఫౌండర్ దుబిశెట్టి కళ్యాణి మాట్లాడుతూ నేత్రాలు చాలా ముఖ్యం నేత్రదానం మరియు నేత్రాలు సరిగా ఉంటేనే మనం ఏ పనైనా చేసుకోగలం అందువల్ల నేత్రాలు అప్పుడప్పుడు చెక్ చేసుకోవడం చాలా మంచిది అని తెలియజేశారు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కొండేటి నరసింహారావుకి ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా మెడికవర్ హాస్పిటల్ వారు బిపి. షుగర్ టెస్టులు చేసి క్యాన్సర్ చెక్ అప్ ఫ్రీగా టోకెన్ ఇచ్చి మెడికవర్ హాస్పిటల్‌లో విశ్వమాత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ వైద్యం అవకాశం కల్పించినందుకు ఫౌండేషన్ తరపున వాసవి ఐ కేర్ హాస్పటల్ వారికి మెడికవర్ హాస్పిటల్ వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వంభరా చారిటబుల్ ట్రస్ట్ ఫౌండర్ సువర్ణకుమారి. మైత్రి ఫౌండేషన్




ఫౌండర్ సరస్వతి ఇక్కడికి విచ్చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు.

# బోధనలో సృజనాత్మకతతోనే విద్యార్థుల్లో వికాసం : డా. సీతాపతి

**- విక్రమ సింహపురి వర్సిటీలో ఆసక్తికరంగా సాగిన 'పంచ కళల' శిక్షణ**

**- జాతీయ విద్యా విధానంపై ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విద్యా బోధనలో కళలను అంతర్భాగం చేయడం ద్వారా విద్యార్థుల్లో సృజనాత్మకతను, మానసిక వికాసాన్ని గణనీయంగా పెంపొందించవచ్చని విశాఖపట్నం ఫైవ్ ఆర్ట్స్ క్లబ్, ఒరిగామి కళా అకాడమీ ప్రతినిధి డా.సీతాపతి పేర్కొన్నారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలోని సోషల్ వర్క్ విభాగం ఆధ్వర్యంలో జరుగుతున్న ఐదు రోజుల ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ మంగళవారం నాటికి నాలుగో రోజుకు చేరుకుంది. 'జాతీయ విద్యా విధానం-2020లో ఉపాధ్యాయ విద్యపై దృక్పథాలు' అనే అంశంపై జరుగుతున్న ఈ సదస్సులో డా.సీతాపతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధ్యాపకులకు ఒరిగామి, కిరిగామి, మండల ఆర్ట్, వార్లీ ఆర్ట్, ఫింగర్ ప్రింట్ ఆర్ట్ వంటి ఐదు రకాల కళారూపాలపై ప్రయోగాత్మక శిక్షణ ఇచ్చారు. సంక్లిష్టమైన పాఠ్యాంశాలను కూడా కళల ద్వారా ఎంత సులభంగా, ఆసక్తికరంగా బోధించవచ్చో ఆయన వివరించారు. కార్యక్రమ సమన్వయకర్త డా.ఆర్.మధుమతి మాట్లాడుతూ నూతన విద్యా విధానం లక్ష్యాలను చేరుకోవడంలో ఇటువంటి సృజనాత్మక బోధనా పద్ధతులు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ ఐదు రోజుల కార్యక్రమం ద్వారా ఉపాధ్యాయ విద్యలో రావలసిన మార్పులపై విశేష చర్చ జరుగుతోందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సిహెచ్.విజయ, డాక్టర్ బి.వి. సుబ్బారెడ్డి, వివిధ బి.ఎడ్ కళాశాలల ప్రిన్సిపల్స్, అధ్యాపకులు, మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళాధారిత బోధనపై అవగాహన పొందారు.

# వైసీపీ కార్యకర్తల ఆనందోత్సాహాల మధ్య 200 మందితో సందడిగా సాగిన 54వ డివిజన్ ఆత్మీయ సమావేశం

**- 54వ డివిజన్ నూతన కమిటీని ప్రకటించిన ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి**

**- పార్టీ కోసం శ్రమిస్తున్న నాయకులు, కార్యకర్తలకు సముచిత స్థానం, గౌరవం కల్పిస్తాం - ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి - 54వ డివిజన్‌లో అందరిని ఏకం చేసి పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేస్తామని స్పష్టం చేసిన పార్టీ క్యాడర్**




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు రాంజీ నగర్ వైసిపి సిటీ ఆఫీస్‌లో వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 54వ డివిజన్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు 200 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా 54వ డివిజన్ ఇన్‌చార్జ్‌గా షేక్ మస్తాన్‌ని కోఆర్డినేటర్లుగా ఖయ్యుమ్, ప్రకాష్, ఖాజాబాబా, ప్రసాద్‌లను నియమించినట్లు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ప్రకటించారు. పార్టీ కార్యకర్తలు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. డివిజన్లో పార్టీ బలోపేతం దిశగా పార్టీకి బలమైన క్యాడర్ ఏర్పడిందని, రాబోయే రోజుల్లో 54వ డివిజన్ లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తిరుగులేని ఆధిక్యం సాధిస్తుందని కార్యకర్తలు ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి డివిజన్ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు అప్పగించడం ఎంతో సంతోషకరమని డివిజన్ ప్రజలకు అందుబాటులో ఉంటూ పార్టీ బలోపేతం దిశగా పని చేస్తానని మస్తాన్ తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ 54వ డివిజన్‌లో పార్టీ నాయకత్వ ఏర్పాటుకు కొంత జాప్యం జరిగినప్పటికీ ప్రస్తుతం బలమైన నాయకత్వాన్ని ఏర్పాటు చేసుకోవడం జరిగిందన్నారు. డివిజన్లో ప్రతి ఒక్కరు పార్టీ నాయకత్వానికి సహకరిస్తూ పార్టీ బలోపేతం దిశగా పనిచేయాలని సూచించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిన్నర కాలంలోని ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైందన్నారు. చంద్రబాబు నాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేశారని అన్నారు. రాష్ట్రంలో సాగుతున్న కూటమి ప్రభుత్వ దుర్మార్గపు పాలనతో ప్రజలు విసిగిపోయారని అన్నారు. ఈ రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు వచ్చినా వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రి చేసుకోనేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డిగా రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయితేనే ప్రజలకు అన్ని విధాల మేలు చేకూరుతుందని తెలిపారు. ఆ దిశగా ప్రతి కార్యకర్త పార్టీ కోసం అన్ని విధాల కష్టపడి పని చేయాలని సూచించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమాన్ని విజయవంతం చేసి పార్టీని ప్రజలకు చేరువ చేయాలన్నారు. ఇప్పుడు ఎవరైతే పార్టీ కోసం శ్రమిస్తున్నారో వారిని గుర్తుంచుకొని వారికి సముచిత స్థానం, గౌరవం దక్కేల చూస్తానన్నారు. ఈ రోజు కార్యకర్తలు, ఎన్ని ఇబ్బందులు పడిన ధైర్యంగా ముందుకు సాగాలని మీకు ఏ కష్టం వచ్చినా మీతో కలిసి మీకు తోడుగా నడుస్తానని చంద్రశేఖర్ రెడ్డి వారికి భరోసానిచ్చారు. అనంతరం నూతనంగా ఎన్నికైన డివిజన్ ఇన్‌చార్జ్ మస్తాన్‌ని కోఆర్డినేటర్లను ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డితో పాటు పలువురు డివిజన్ నేతలు సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి స్టేట్ సెక్రెటరీ పేర్నాటి కోటేశ్వర రెడ్డి వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు మజ్జిగ జయకృష్ణ రెడ్డి 5, 9, 11, 53 డివిజన్ ఇన్‌చార్జ్‌లు సుబ్బారెడ్డి, ధనుజా రెడ్డి, మహేష్ యాదవ్ వెంగల్ రెడ్డి డివిజన్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రాజెక్టుల భూసేకరణను త్వరగా పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి**




**విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రాజెక్టులకు చేపట్టిన భూసేకరణ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ ప్రాజెక్టులకు భూసేకరణకు సంబంధించి కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో మంగళవారం సాయంత్రం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం, తోటపల్లి, తారకరామ తీర్ధసాగర్ ప్రాజెక్టులు, జాతీయ రహదారి 516(బి), కుర్ధారోడ్-విజయనగరం మూడో రైల్వే లైన్, విజయ నగరం-సంబల్‌పూర్ 3వ రైల్వేలైన్, కొత్తవలస-విజయనగరం నాలుగో రైల్వేలైన్ తదితర ప్రాజెక్టుల భూసేకరణపై సమీక్షించారు. అలాగే గుర్ల స్టీల్‌ప్లాంట్, ఐటి పార్కులకు భూ సేకరణ, పతంజలి, మామహామాయచ, ఒబెరాయ్ హెటల్స్‌కు రహదారి తదితర అంశాలపైనా ఆరా తీశారు. వీటన్నిటినీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా గిరిజన విశ్వవిద్యాలయంలో విద్యుత్ లైన్లను వెంటనే తొలగించాలని, ఇతర సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.సేధుమాధవన్, డిఆర్ఓ ఇ.మురళి, ఆర్‌డిఓలు డి.కీర్తి, సత్యవాణి, రామ్మోహన్, ఎస్‌డిసిలు కళావతి, ప్రమీలా గాంధి, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ లక్ష్మణరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, ఇరిగేషన్ ఈఈ వెంకటరమణ, రైల్వే తదితర శాఖల అధికారులు, ఎల్ఏ డిటిలు పాల్గొన్నారు.

# సీతం ఇంజనీరింగ్ కాలేజీలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**విజయనగరం, (రాజధాని వార్తలు):** విజయనగరం జిల్లా, స్థానిక గాజులరేగ సమీపంలోని సీతం ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కాలేజ్ (సీతం) లో 2025 డిసెంబర్ 23వ తేదీన క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో, ఆనందోత్సాహాల మధ్య సాగింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన స్టూడెంట్ కౌన్సిలర్ మరియు యుఈఎస్ఐ స్టాఫ్ బ్రదర్ ఆర్.రాజు కుమార్ క్రిస్మస్ సందేశాన్ని అద్భుతంగా అందించారు. యేసుక్రీస్తు ప్రేమ, క్షమ, సేవ అనే గుణాలు ప్రతి ఒక్కరి జీవితంలో ఎలా ప్రతిబింబించాలో వివరించారు. ఆయన ప్రసంగం విద్యార్థులు మరియు సిబ్బందిని ఎంతో ప్రేరేపించింది. ఈ కార్యక్రమంలో కళాశాల కారస్పాండెంట్ మరియు సెక్రటరీ డా. బొత్సా ఝాన్సీ ముఖ్య సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, క్రిస్మస్ పండుగ ప్రేమ, శాంతి, క్షమ మరియు మానవ సేవల గొప్పతనాన్ని చాటి చెప్పే పవిత్ర పండుగ అని పేర్కొన్నారు. యేసుక్రీస్తు బోధనలు నేటి యువతకు ఆదర్శప్రాయమని, పరస్పర గౌరవం, సహనం మరియు ఐక్యతతో ముందుకు సాగాలని ఆమె సూచించారు. విద్యార్థులు విద్యతో పాటు మంచి విలువలను అలవర్చుకుని సమాజానికి ఉపయోగపడే పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. డా. బొత్సా ఝాన్సీ సందేశం కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కాలేజ్ డైరెక్టర్ మజ్జి శశిభూషణ్ రావు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఇటువంటి వేడుకలు విద్యార్థుల్లో మానవీయ విలువలను పెంపొందిస్తాయని




అన్నారు. అలాగే ప్రిన్సిపాల్ డా. డి.వి. రామ్మూర్తి విద్యార్థులు చదువుతో పాటు మంచి విలువలు కలిగి ఎదగాలని ఆకాంక్షిస్తూ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు ఆలపించిన క్రిస్మస్ గీతాలు, యాక్షన్ సాంగ్స్ అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం నిర్వహించిన క్యాండిల్ లైట్ సర్వీస్ ఆధ్యాత్మికతను మరింత పెంచింది. వేడుకల చివర్లో కేక్ కటింగ్ కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెచ్.ఓ.డీలు, బోధనా మరియు బోధనేతర సిబ్బంది, అలాగే పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. చివరగా ప్రార్థనతో ఈ క్రిస్మస్ వేడుకలు శాంతియుతంగా ముగిశాయి.

# సంపాదకీయం

## కమల సరోవరంపై మోదీ సూర్యుడు

ఈ నెల 10వ తేదీన తెలంగాణ బీజేపీ ఎంపీలతో ప్రధానమంత్రి నరేంద్రమోదీ సమావేశమయ్యారు. వచ్చీ రాగానే ఆయన అత్యంత ఆగ్రహంతో మాట్లాడారు. ఎంపీల గుండెలు బితుకుబితుకుమన్నాయి. ఎంపీల్లో ప్రతి ఒక్కరికీ తగిలే విధంగా మోదీ తీవ్రంగా మందలించారు. '1984 లోక్‌సభ ఎన్నికల్లో దేశ వ్యాప్తంగా బీజేపీకి కేవలం రెండే సీట్లు లభించాయి. గుజరాత్ లోని మెహసానా సీటు నుంచి ఏకే పాటిల్ ఎన్నికయ్యారు. హనుమకొండ సీటు నుంచి జంగారెడ్డి గెలిచారు. నాడు రాజీవ్‌గాంధీ బీజేపీని హమ్ దో, హమారే దో అని ఎద్దేవా చేశారు. ఇవాళ గుజరాత్‌లో బీజేపీ పరిస్థితి ఎలా ఉన్నది, తెలంగాణలో పరిస్థితి ఎలా ఉన్నది?' అని ఆయన ప్రశ్నించారు. ఆయన మాటలకు ఎవరికీ నోరు పెగల్లేదు. 'మీ కంటే ఒవైసీ బెటర్' అని మోదీ నిష్ఠూర మాడడం అన్నిటి కంటే అవమానకమని ఒక ఎంపీ అన్నారు. తెలంగాణ ఎంపీలను మోదీ ఎందుకు టార్గెట్ చేశారు? ఎంపీలకు మోదీ క్లాస్ తీసుకునేందుకు అయిదు రోజుల ముందు పార్టీ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హైదరాబాద్ వెళ్లి వచ్చారు. పార్టీలో అంతర్గత వ్యవహారాల గురించి మాట్లాడుతున్న నేతలను ఆయన తీవ్రంగా మందలించారు. 'ఉంటే ఉండండి. పోతే పోండి' అని ఆయన హెచ్చరించారు. బహుశా సంతోష్ ద్వారా నివేదిక అందిన తర్వాతే మోదీ ఇలా విరుచుకు పడ్డట్లు సమాచారం. మోదీ అంతటితో ఆగలేదు. పార్ల మెంటు సమావేశాలు ముగిసేందుకు రెండు రోజుల ముందు బీఆర్ఎస్ ఎంపీలను పిలిచి మాట్లాడారు. ఆయన పిలిపించి మాట్లాడారా, లేక వారే కలుసుకునే ప్రయత్నం చేశారా అన్నది స్పష్టంగా తెలియదు. కరీంనగర్, వరంగల్ సమస్యల గురించి మాట్లాడేందుకు మంత్రుల ద్వారా అపాయింట్‌మెంట్ కోరితే మోదీ వెంటనే పిలిపించారని బీఆర్ఎస్ ఎంపీ ఒకరు చెప్పారు. విచిత్రమేమంటే మోదీ ఈ సమావేశంలో కేసీఆర్ ఆరోగ్యం గురించి ఆరా తీశారు. తాను ఏదో సోషల్ మీడియాలో చూశానని, కేసీఆర్ బాగా బరువు తగ్గినట్లు కనపడ్డా కోలుకుంటున్నట్లు తెలిసిందని మోదీ వారికి చెప్పారు. కేసీఆర్ కోలుకోవడం చాల మంచి పరిణామం అని ప్రధానమంత్రి వ్యాఖ్యానించినట్లు తెలిసింది. కేసీఆర్ గురించి మోదీ మాట్లాడిన మరో మూడు రోజులకు కేసీఆర్ అనూహ్యంగా మీడియా ముందుకు వచ్చారు. తన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లు అన్నిటినీ తుత్తునియలు చేస్తూ దాదాపు గంటన్నరకు పైగా తన ఒరిజినల్ శైలిలో కాంగ్రెస్‌పై విరుచుకు పడ్డారు. దీనితో ఇంతకాలం స్తబ్దంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్ చాలా ఉత్సాహంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఆయన ఏ విషయాలు ప్రస్తావించారు, అన్నీ నిజాలే మాట్లాడారా అన్నది ప్రశ్న కాదు. మళ్లీ విజృంభిస్తానని కేసీఆర్ చెప్పడం చర్చనీయాంశమైంది. జూబిలీహిల్స్ ఓటమి తర్వాత క్రుంగిపోయిన పార్టీకి మరోసారి ఆశలు రేకెత్తాయి. తెలంగాణకు బీఎల్ సంతోష్ వెళ్లిరావడం, మోదీ తమ పార్టీ ఎంపీలను విమర్శించడం, బీఆర్ఎస్ ఎంపీలను పిలిచి మాట్లాడడం, ఆ తర్వాత కేసీఆర్ రంగప్రవేశం చేయడం... ఈ నాలుగు ఘటనలకు ఏమైనా అంతస్సంబంధం ఉన్నదా? అంతకు ముందే తెరవెనుక ఇంకా ఏమైనా పరిణామాలు జరిగాయా? ఏమైనా ఒక విషయం మాత్రం స్పష్టం: మోదీ పూర్తిగా తెలంగాణపై దృష్టి కేంద్రీకరించారు. ఒకవైపు వచ్చే ఏడాది ప్రథమార్థంలో పశ్చిమబెంగాల్, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి ఎన్నికలు జరగాల్సి ఉండగా, తెలంగాణపై మోదీ ఎందుకు దృష్టి కేంద్రీకరిస్తున్నారు? పక్కనే ఉన్న కర్ణాటకలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి పరస్పర వ్యతిరేక విమర్శలు గుప్పించుకుంటుండగా, ఆ రాష్ట్రాన్ని వదిలి తెలంగాణను పట్టించుకోవాల్సిన తక్షణ అవసరం ఏమున్నది? తెలంగాణలో రేవంత్‌రెడ్డి రోజురోజుకూ బలోపేతం కావడం, కాంగ్రెస్ అధిష్ఠానానికి కూడా ఆయన అన్ని విధాలా అండదండలివ్వడం మోదీ దృష్టికి వచ్చే ఉంటుంది. తెలంగాణ బీజేపీ నేతలు పరస్పరం ఘర్షించుకోవడం, స్థానిక పార్టీ అధ్యక్షుడు రామచందర్‌రావుపై ఆధిపత్యం చలాయించే ప్రయత్నం చేయడం మొదలైన వాటిని మోదీ హర్షించడం లేదు. కేసీఆర్ ఆరోగ్యం గురించి చాలా మందికి తెలియని సమాచారం మోదీకి ఉన్నప్పుడు తెలంగాణ కాంగ్రెస్‌లో జరిగే పరిణామాలు, రేవంత్‌రెడ్డి ఎదుగుతున్న తీరు ఆయన గమనించకుండా ఉంటారా? అయితే మోదీ తదుపరి ఎత్తుగడ ఏమిటో ఎవరు అంచనా వేయగలరు? మోదీ గురి ఎక్కడో ఉన్నట్లు కనిపించినా అది ఎక్కడ తగులుతుందో ఆయనకు మాత్రమే తెలుసు. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానానికి ఇలాంటి పరిణామాలు పట్టకపోవచ్చు కానీ రేవంత్‌రెడ్డి మాత్రం అంచనా వేయకుండా ఉంటారా? ఈ పరిణామాలన్నిటి వెనుక ఒక విషయం స్పష్టమవుతోంది. కేంద్ర ప్రభుత్వంలోనే కాదు, భారతీయ జనతా పార్టీలో కూడా కర్త, కర్మ, క్రియ నరేంద్రమోదీ యే, సందేహం లేదు. ఆయనే అన్నీ. మోదీయే పార్టీ అధ్యక్షుడు, దేశ ప్రధానమంత్రి కూడా. బీజేపీలో సాధారణంగా పార్టీ జాతీయ అధ్యక్షుడి స్థానంలో ఉన్నవారు పార్టీ వ్యవహారాలను నిర్వహిస్తూ పార్టీ అంతర్గత సమావేశాల్లో కీలక నాయకులతో చర్చించి వ్యూహరచన చేసేవారు. లాల్ కృష్ణ ఆడ్వాణీ, అటల్‌బిహారీ వాజపేయి, మురళీమనోహర్ జోషి, కుశాభావు థాక్రే, జానా కృష్ణమూర్తి, వెంకయ్య నాయుడు, రాజ్‌నాథ్ సింగ్, నితిన్ గడ్కరి వంటి హేమాహేమీలు పార్టీ అధ్యక్షులుగా ఉన్నంతవరకూ బీజేపీ కార్యాలయంలో ఒక రకమైన ప్రజాస్వామిక రాజకీయ వాతావరణం ఉండేది. వెంకయ్యనాయుడు పార్టీకి, ప్రభుత్వానికీ మధ్య వారధిలా ఉంటూ పార్టీని నిర్వహించేవారు. చాలామంది కేంద్రమంత్రులు పార్టీ కార్యాలయానికి తమ శాఖలో తీసుకుంటున్న నిర్ణయాల గురించి తెలియజేసేవారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుల నియామకంలో జాతీయ అధ్యక్షులే నిర్ణయం తీసుకునే వారు. 'ఒక చేతిలో ఎన్డీఏ ఎజెండా, మరో చేతిలో బీజేపీ జెండా' ఇత్యాది నినాదాలను వెంకయ్యే రూపొందించేవారు.

# అంగరంగ వైభవంగా సంక్రాంతి ఉత్సవాలు

**- జనవరి 11 నుండి 13వ తేదీ వరకు వివిధ రకాల పోటీలతో ఉత్సవాలు**

**- సంక్రాంతి సంబరాలు, సర్ధర్ కాటన్ గోదావరి ట్రోఫీ ఉత్సవాలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష**





**అమలాపురం, (రాజధాని వార్తలు):** కోనసీమ సంక్రాంతి సంబరాలు,సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ట్రోఫీ ఉత్సవాలను అత్యంత అంగరంగ వైభవంగా ప్రశాంత వాతావరణంలో విజయవంతం చేయాలనిజిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ అధ్యక్షతన మంగళవారం పర్యాటక, జలవనరులు, పోలీస్ అధికారులతో ఆర్డీఓ సమావేశం నిర్వహించి కోనసీమ సంక్రాంతి సంబరాల ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించారు. జనవరి 11వ తేదీ నుండి 13వ తేదీ వరకు ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. 11వ తేదీ ఉదయం ఏడు గంటల నుండి ఆత్రేయపురం కాలువ లాకులు వద్ద స్విమ్మింగ్ పోటీలు ప్రారంభిస్తారని ప్రధమ బహుమతిగా రూ.8 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతిగా రూ.4 వేలు ప్రకటించినట్లు తెలిపారు. అదేరోజు ఉదయం 9 గంటల నుండి ఆత్రేయపురం ప్రధాన రహదారిపై రంగోలి ముగ్గుల పోటీలు నిర్వహించి ప్రధమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు, తృతీయ బహుమతిగా రూ.5 వేలు ప్రకటించారన్నారు. జనవరి 13వ తేదీ మధ్యాహ్నం12 గంటలకు ఆత్రేయపురం కెనాల్ వద్ద గాలిపటాల పోటీలు ప్రారంభిస్తారని వీటిలో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.4 వేలు, తృతీయ బహుమతిగా 3 వేలు ప్రకటించనున్నట్లు తెలిపారు. కోనసీమ సంక్రాంతి సంబరాలు, గోదావరి ట్రోఫీ, డ్రాగన్ బోట్ ఫెస్టివల్ జనవరి 12 ,13 తేదీలలో ఆత్రేయపురం కాలువ లొల్ల లాకులు డౌన్ స్ట్రీమ్ నందు ఉచ్చిలి దేవాలయం నుండి బ్రిడ్జ వరకు నిర్వహించడం జరుగుతుందని ఈ డ్రాగన్ బోట్ ఉత్సవ పోటీలలో కేరళ, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి సుమారుగా 28 టీములు పాల్గొనే అవకాశం ఉందన్నారు. ఈ పోటీలలో మొదటి స్థానంలో గెలుపొందిన బృందానికి రూ. 2 లక్షలు, ద్వితీయ స్థానంలో గెలుపొందిన బృందానికి లక్ష రూపాయలు బహుకరించడం జరుగుతుందన్నారు. ఈ సంక్రాంతి సంబరాలలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా జనవరి 1 వ తేదీ రాత్రి 7 గంటలకు సినీ ఆర్కెస్ట్రా కార్యక్రమం ఆత్రేయపురం హైస్కూల్ గ్రౌండ్ నందు నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా 12వ తేదీ రాత్రి 7 గంటల నుండి బాండ్ సేహరి మ్యూజికల్ కార్యక్రమం ఉంటుందన్నారు. పర్యాటక శాఖ ద్వారా రెండు స్పీడ్ బోట్లు రెండు జెట్ స్పీడ్ బోట్లు రాకపోకలకు అనువుగా జెట్టిని ఏర్పాటు చేయాలన్నారు. శాఖల సమన్వయంతో మూడు రోజులు కార్యక్ర మాలు పర్యవేక్షణకు ఇన్చార్జిలను నియమించాలన్నారు. ఈ సంబరాలలో పాల్గొనేందుకు రోజువారీగా వచ్చే పర్యాటకుల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్, మొబైల్ టాయిలెట్లు, పర్యాటకుల ఆరోగ్య భద్రతకై పీహెచ్‌ఈ వైద్యులతో కూడిన వైద్య శిబిరాలు లాకుల వద్ద హైస్కూల్ వద్ద ఏర్పాటు చేయాలన్నారు. ట్రాఫిక్కు జాముకు అవకాశం లేకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలన్నారు. పంచాయతీ సిబ్బంది ద్వారా నిత్యం పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలన్నారు. ఈత పోటీలకు గాను జిల్లా స్పోర్ట్స్ డెవలప్మెంట్ అథారిటీ వారి పర్యవేక్షణలో డ్రిల్ మాస్టర్లను నియమించి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చర్యలు బలోపేతం చేయాలన్నారు. మత్స్యశాఖ అధికారులు మూడు పడవలను లైఫ్ జాకెట్లతో సహా సిద్ధం చేయాలన్నారు. స్పేస్ మీడియా మొత్తం ప్రక్రియను డాక్యుమెంటేషన్ చేసి సమర్పించాలని ఈ డాక్యుమెంట్ ఆధారంగా భవిష్యత్తులో చేపట్టబోయే కార్యక్రమాలను నిర్దేశించుకోవడం జరుగుతుందన్నారు. ఆత్రేయపురం, వాడపల్లి గ్రామాల విశిష్టతపై ఆడియో సాంగ్ రూపొందించి సామాజిక మాధ్యమాలలో ప్రమోట్ చేయాలన్నారు. రంగోలి పోటీలలో పాల్గొనేందుకు ఇప్పటివరకు 100 మంది మహిళలు నమోదయినట్లు తెలిపారు. వచ్చిన అతిథులకు రావులపాలెం సి ఆర్ సి సిరి గార్డెన్స్ తదితర ప్రదేశాల్లో వసతి కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్డిఓ పి శ్రీకర్, జిల్లా పర్యాటక అధికారి అన్వర్, డి.ఎస్.పి ఏ మురళీమోహన్, ఎంపీడీవో వెంకట రామన్, మత్స్యశాఖ ఏడి వర్ధన్, జలవరుల శాఖ ఎస్సీ గోపిమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన ఎంపీ హరీష్ బాలయోగి

**- ఆరుగురు లబ్ధిదారులకు రూ. 2 లక్షల 99 వేల 368 చెక్కులను ఎంపీ పంపిణీ**





**అమలాపురం, (రాజధాని వార్తలు):** అనారోగ్యంతో బాధ పడుతూ వైద్యం నిమిత్తం ప్రభుత్వ సాయం కోరి ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్న పలువురు బాధితులకు అమలా పురం ఎంపీ హరీష్ బాలయోగి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని ఎంపీ కార్యాలయంలో మంగళవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు ఎంపీ హరీష్ బాలయోగి అందజేశారు. ఈ సందరరేగా ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ పేదలను ఆదుకోవడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముందుంటారని అన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన లబ్ధిదారుల వివరాలు: అయినవిల్లి మండలం. వీరవల్లి పాలెం గ్రామానికి చెందిన మేడిశెట్టి గంగాభవాని వైద్య నిమిత్తం రూ.25,541, అయినవిల్లి మండలం వీరవల్లి పాలెంకు చెందిన అడపా హరిణి రూ. 25,000 వేలు, రాజోలు మండలం కడలి గ్రామా నికి చెందిన బుసిమి రాజకుమార్ రూ.77,763, అంబాజీపేట మండలం కే పెదపూడి గ్రామానికి చెందిన పెదపూడి రామకృష్ణకు 18,992, అయిన విల్లి మండలం పోతుకుర్రు గ్రామానికి చెందిన కడలి శ్రీనివాస్‌కు రూ.64,846, రావులపాలెం మండలం ఈతకోట గ్రామానికి చెందిన తుమ్మల పల్లి రత్నావతికి రూ. 87,226 మొత్తం రూ. 2,99,368 రూపాయల చెక్కులను ముఖ్యమంత్రి సహాయనిధి నుండి అందజేసినట్లు ఎంపీ హరీష్ తెలిపారు. తమకు సాయం అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు.

# కరప మండలం రేషన్ డీలర్లకు సమావేశం

**- రేషన్ వ్యవస్థలో నిర్లక్ష్యం సహించం : డిప్యూటీ తాసిల్దార్ రామ వీరభద్రరావు**



**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం తాసిల్దార్ కార్యాలయంలో మంగళవారం సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ గొల్లపల్లి రామ వీరభద్రరావు అధ్యక్షతన మండల రేషన్ డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీలర్లకు పలు కీలక సూచనలు జారీ చేశారు. అధికారిక సమావేశాలకు డీలర్లు తప్పనిసరిగా స్వయంగా హాజరు కావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నామినీ లను పంపరాదని హెచ్చరించారు. ప్రభుత్వ నిర్దేశిత సమయాల్లోనే రేషన్ దుకాణాలు తెరిచి ఉంచాలని సూచించారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, అలాగే సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు రేషన్ షాపులు తెరిచి ఉంచాలని స్పష్టం చేశారు. కార్డుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, ప్రతి నెల 26 నుంచి 30వ తేదీల మధ్య వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు మండలంలోని అన్ని రేషన్ దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. అనుమతి లేకుండా రేషన్ షాపులు మూసివేయడం లేదా నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లయితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు నల్ల వెంకటేశ్వరరావు డీలర్లు జెల్లా శివకుమార్, నక్క నాగేశ్వరరావు, మూడే చంద్రశేఖర్, పేపకాయల గోవిందరాజులు, జయ లక్ష్మి సత్యవతి, నూక రత్నం తదితరులు పాల్గొన్నారు.

# యండమూరిలో పరిశభ్రత చర్యలు తనిఖీ

**- పరిశుభ్రతే గ్రామ అభివృద్ధికి పునాది : అధికారులు**





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలం యండమూరిలో పరిశుభ్రత చర్యలను మంగళవారం అధికారులు తనిఖీ నిర్వహించారు. ఈ సందరరేగా ఎంపీడీఓ జటావల్లభుల శ్రీనివాస్, డిప్యూటీ ఎంపీడీఓ సలాది వెంకట శ్రీనివాసరావులు గ్రామ పంచాయతీని ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. ప్రజల్లో పరిశుభ్రత అవగాహన పెంపొందించే చర్యలపై పంచాయతీ అధికారులతో వివరాలు తెలుసుకున్నారు. ప్రతి ఇంటి వద్ద రోజువారీ చెత్తను సకాలంలో సేకరించడంతో పాటు, పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని గ్రామస్తులను కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఆధునిక సాంకేతిక పద్ధతులను అవలంబించాలని సూచించారు. ప్రభుత్వ కాల్స్ ద్వారా ప్రజల అభిప్రాయాలు తెలుసుకొని సమస్యలను త్వరగా పరిష్కరించి గ్రామాభివృద్ధికి దోహదపడుతుందని తెలిపారు. పంచాయతీ పనితీరును మరింత పారదర్శకంగా సమర్థవంతంగా మార్చేలా అధికారులు కలిసి పని చేయాలని ఆదేశించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుండి సంపద సృష్టి షెడ్డును పరిశీలించారు. చెత్త వర్గీకరణ, తడి చెత్త నుండి ఎరువుల తయారీ పొడి చెత్త సేకరణ విధానాలను వీక్షించి సిబ్బందిని ప్రశంసించారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి అధికారులకు సహకరించాలని ప్రజలను కోరారు. స్వర్ణ పంచాయితీ విస్తృత ప్రచారం చేయాలని, పరిశుభ్రమైన గ్రామ వాతావరణం సృష్టించడానికి అధికారులు, ప్రజలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

# క్రీడాలతో ఉన్నత స్తితి : డిసిసిబి ఛైర్మన్


**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** యువత క్రీడల్లో రాణిస్తే ఉన్నత శిఖరాలకి వెళ్తారని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాల సహకార కేంద్ర బ్యాంక్ ఛైర్మన్, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్య క్షులు తుమ్మల రామస్వామి (బాబు) అన్నారు. పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఖోఖో క్రీడకు సంభందించి ఐదు రోజులపాటు ఇచ్చే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారభించారు. 15 మందిని ఎంపిక చేసి ఖోఖో క్రీడకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి ఎంపిక చెయ్యగా ఆ జట్టుకి చంద్రమాంపల్లి జనసేన పార్టీ యువత నాయకులు వెన్న వెంకటేష్ ప్రోత్సాహంతో మహి ళలు, పురుషులు విభాగాలకు క్రీడా జట్టులకు జెర్సీలను తుమ్మల బాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయికి ఎన్నికైన క్రీడా జట్టును ఆయన అభినందించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి ఎంపికైన జట్టు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనపరచి ప్రథమ స్థానంలో నిలిచి జిల్లాకి పేరు తీసుకు రావాలని ఆయన కోరారు. కూటమి ప్రభుత్వం క్రీడలకు పెద్దపీట వేస్తూ ప్రోత్స హిస్తుందని, ప్రతి ఒక్కరు విద్యార్థి దశ నుండే క్రీడల్లో పాల్గొని తమ ఆరోగ్యాన్ని, మేధాశక్తిని పెంచుకోవాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన మండలం అధ్యక్షులు దాసు శివబాబు, ఉప సర్పంచి వెన్న సత్యనారాయణ, నాయకులు కంటి బోయినప్రసాద్, నూకలమంతి నానాజీ, ద్వారంపూడి చల్లారావ్, నీటిసంగం ఉపాధ్యక్షులు జట్లా విజయబాబు, కంటిబోయినా జీవ, కురుమెల్ల నాగబాబు, పాలిశెట్టి రాజు, వల్లభశెట్టి రాంబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# ఆస్కార్ ఎంట్రీ మూవీకి కాపీ చిక్కులు!



ఆస్కార్ రేసులో నిలిచి అకాడమీ అవార్డుని దక్కించుకోవాలని ప్రతి టెక్నీషియన్ ఆశగా ఎదురు చూస్తుంటారు. అలాంటి ఆశతో ఆస్కార్ ఎంట్రీకి అర్హత సాధించింది ఇండియన్ మూవీ హోమ్‌బౌండ్. ఇషాన్ కట్టర్, విశాల్ జత్వా, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటించారు. నీరజ్ ఘైవాన్ దర్శకత్వంలో కరణ్ జోహార్, ఆదార్ పూనావాలా మరో ముగ్గురు కలిసి నిర్మించారు. ఈ ఏడాది మే 25న కేన్స్‌లో ప్రదర్శించిన ఈ మూవీని సెప్టెంబర్‌లో విడుదల చేశారు. ప్రస్తుతం ఈ మూవీ దేశ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. భారత్ తరుపున 2026 ఆస్కార్ కోసం పోటీపడుతున్న ఈ మూవీపై తాజాగా వివాదం మొదలైంది. ఆస్కార్ ఎంట్రీ సాధించిన హోమ్‌బౌండ్‌పై ఓ రచయిత్రి సంచలన ఆరోపణలు చేయడం ఆసక్తికరంగా మారింది. తన నవలను కాపీ కొట్టి ఈ సినిమా తీశారంటూ రచయిత్రి పూజా చంగోయివాలా చేసిన ఆరోపణలు సంచలనం సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో ఆమె హోమ్‌బౌండ్ దర్శక నిర్మాతలపై న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్టు ప్రకటించారు. 2021లో హోమ్‌బౌండ్ పేరుతో తాను ఓ నవలని రాశానని, ఈ సినిమా టైటిల్ దగ్గరి నుంచి ఇందులోని పాత్రల వరకు అన్నీ తన నవలనే పోలి ఉన్నాయని ఆమె ఆరోపించారు. అక్టోబర్ 15న నిర్మాణ సంస్థకు లీగల్ నోటీసులు జారీ చేశానని, అయితే వాటికి వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదన్నారు. దీంతో తాను న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నట్టు ఆమె చెబుతున్నారు. రచయిత్రి పూజా ఆరోపణలపై హోమ్‌బౌండ్ నిర్మాణ సంస్థ స్పందించింది. మేము చట్టపరంగా సమాధానం ఇస్తాం. ఇప్పుడు దీని గురించి ఎలాంటి కామెంట్స్ చేయలేం అని స్పష్టం చేసింది. ఈ ఏడాది కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఈ మూవీని ప్రదర్శించారు. ఈ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఎంపికైన తొలి భారతీయ సినిమాగా రికార్డు సాధించింది. అనంతరం చిత్ర బృందం మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. న్యూయార్క్ టైమ్స్‌లో వచ్చిన ఓ ఆర్టికల్ ఆధారంగా ఈ మూవీని రూపొందించామని వెల్లడించారు. టొరంటో అంతర్జాతీయ చలన చిత్రోత్సవంలో రెండో రన్నరప్‌గా నిలిచి ఇంటర్నేషనల్ పీపుల్స్ ఛాయిస్ అవార్డును గెలుచుకుంది. ఇదే ఊపుతో వచ్చే ఏడాది జరగనున్న ఆస్కార్ అవార్డులకు ఎంపికై అందరి దృష్టిని ఆకర్షించింది. బెస్ట్ ఫారిన్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో పోటీపడి ఇటీవల విడుదల చేసిన షార్ట్ లిస్ట్ జాబితాలో స్థానం దక్కించుకుని భారతీయ ప్రేక్షకుల్లో ఆస్కార్ ఆశల్ని రేకెత్తించింది. వచ్చే ఏడాది విదేశీ చిత్రాల విభాగంలో హోమ్‌బౌండ్ ఆస్కార్ సాధిస్తే జాన్వీ కపూర్ ఖాతాలో ఆస్కార్ మూవీ చేరడం ఖాయం అని బాలీవుడ్ వర్గాలు అంటున్నాయి. పోలీసు కావాలనే కలని సాధించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కుల, మత వివక్షకు వ్యతిరేకంగా ఇద్దరు స్నేహితులు చేసిన పోరాటం నేపథ్యంలో ఈ మూవీని రూపొందించారు. ఇండియన్ ప్రేక్షకులతో పాటు వరల్డ్ వైడ్‌గా సినీ ప్రియుల దృష్టిని ఆకర్షించిన ఈ మూవీ ప్రస్తుతం నెట్ ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ అవుతోంది.

# స్టూడెంట్ నెం.1 నుంచి ఛాంపియన్ దాకా.. ఎన్టీఆర్ ఎమోషనల్




రోషన్ మేక హీరోగా నటిస్తున్న 'ఛాంపియన్' సినిమాపై రోజురోజుకూ అంచనాలు పెరిగిపోతున్నాయి. డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమా కోసం యంగ్ టైగర్ ఎన్టీఆర్ రంగంలోకి దిగారు. లేటెస్ట్ గా ఆయన ఈ సినిమాకు సంబంధించిన 'సెలిబ్రేషన్ ఆఫ్ ఛాంపియన్' అనే సరికొత్త టీజర్‌ను విడుదల చేశారు. ఇంతకుముందు వచ్చిన ట్రైలర్ చాలా సీరియస్‌గా, ఎమోషనల్‌గా ఉంటే, ఇప్పుడు రిలీజ్ చేసిన ఈ టీజర్ మాత్రం ఫుల్ ఎనర్జీతో, పండగ వాతావరణాన్ని తలపిస్తోంది. ఈ కొత్త టీజర్‌లో రోషన్ చాలా ఉత్సాహంగా, స్టైలిష్‌గా కనిపిస్తున్నాడు. "ఇట్స్ టైమ్ టు సెలబ్రేట్" అంటూ మొదలయ్యే ఈ వీడియోలో విజువల్స్ చాలా కలర్ ఫుల్‌గా ఉన్నాయి. ముఖ్యంగా "మాజాక్ రా" అంటూ వచ్చే డైలాగ్స్, బ్యాక్ గ్రౌండ్‌లో వచ్చే మ్యూజిక్ సినిమాలోని మరో కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. హీరోయిన్ అనస్వర రాజన్‌తో రోషన్ కెమిస్ట్రీ, ఆ డాన్స్ మూవ్స్ యూత్‌ని కచ్చితంగా ఆకట్టుకుంటాయి. ఈ సందర్భంగా ఎన్టీఆర్ స్వప్న సినిమాస్ బ్యానర్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. "స్టూడెంట్ నెం.1 నుంచి ఛాంపియన్ వరకు.. స్వప్న, ప్రియాంక దత్ ఎప్పుడూ కొత్త టాలెంట్‌ను ఎంకరేజ్ చేస్తూనే ఉన్నారు" అని తారక్ కొనియాడారు. సినిమా మీద ప్రేమతో, కొత్తదనం కోసం వారు చేసే ప్రయత్నాలు స్వప్న సినిమాస్‌కు ఒక ప్రత్యేకమైన బ్రాండ్‌ను క్రియేట్ చేశాయని ఆయన అభిప్రాయపడ్డారు. తాను చేసే ప్రతి పనిలో స్వప్న ఎలాగైతే తనకు అండగా నిలబడ్డారో, తాను కూడా ఆమెకు ఎప్పుడూ సపోర్ట్‌గా ఉంటానని ఎన్టీఆర్ ఎమోషనల్ అయ్యారు. రోషన్, అనస్వర, దర్శకుడు ప్రదీప్ అద్వైతం సహా టీమ్ మొత్తానికి తన బెస్ట్ విషెస్ అందించారు. ఎన్టీఆర్ సపోర్ట్ దొరకడంతో ఛాంపియన్ టీమ్‌లో జోష్ రెట్టింపు అయ్యింది. బైరాన్‌పల్లి గ్రామంలో రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన చారిత్రక పోరాటమే ఈ సినిమా కథాంశం. కానీ ఇందులో యాక్షన్, ఎమోషన్‌తో పాటు మంచి ఎంటర్టైన్మెంట్ కూడా ఉంటుందని లేటెస్ట్ టీజర్ చూస్తుంటే అర్థమవుతోంది. 2025 ఇయర్ ఎండింగ్‌లో వస్తున్న ఈ సినిమా మెమరబుల్ హిట్‌గా నిలుస్తుందని ఎన్టీఆర్ ఆశాభావం వ్యక్తం చేశారు. డిసెంబర్ 25న థియేటర్లలో చాంపియన్ గేమ్ మొదలుకానుంది. ఎన్టీఆర్ చేతుల మీదుగా వచ్చిన ఈ టీజర్ సినిమాపై హైప్ ను నెక్స్ట్ లెవెల్‌కు తీసుకెళ్లింది. రోషన్ తన నటనతో, డాన్స్ తో ఆడియెన్స్‌ను ఎలా మెప్పిస్తాడో చూడాలి. 'ఛాంపియన్' నిజంగానే బాక్సాఫీస్ ఛాంపియన్ అవుతుందో లేదో తెలియాలంటే మరికొన్న గంటల వరకు ఆగాల్సిందే.

# డింపుల్‌కి ఇదే చివరి అవకాశం..!



తెలుగు అమ్మాయి డింపుల్ హయతి డ్యాన్స్‌లు అదరగొట్టేస్తుంది. గద్దలకొండ గణేష్ సినిమాలో జస్ట్ ఒక్క పాటతో అమ్మడు సూపర్ క్రేజ్ తెచ్చుకుంది. ఐతే ఆ తర్వాత అమ్మడికి హీరోయిన్‌గా ప్రమోషన్ వచ్చేసింది. మాస్ మహారాజ్ రవితేజతో ఖిలాడి సినిమా చేసింది డింపుల్ హయతి. ఐతే ఆ సినిమా కమర్షియల్‌గా వర్క్ అవుట్ కాలేదు. ఇంకా రెండు మూడు సినిమాలు చేసినా డింపుల్‌కి లక్ కలిసి రాలేదు. మరోపక్క ఆమె కొన్ని వివాదాల్లో చిక్కుకోవడం కూడా ఆమెకు అవకాశాలు లేకుండా చేసింది. ఆఫ్టర్ షార్ట్ గ్యాప్ డింపుల్ హయతి మరోసారి మాస్ రాజా రవితేజతో కలిసి వస్తుంది. భర్త మహాశయులకు విజ్ఞప్తి సినిమాలో నటించింది డింపుల్ హయతి. ఈ సినిమాలో ఆమెతో పాటు ఆషిక రంగనాథ్ కూడా నటించింది. రవితేజ ఎనర్జీతో పాటు ఈ ఇద్దరు ముద్దుగుమ్మల ఎనర్జీ కూడా సినిమాకు ప్లస్ అయ్యేలా ఉంది. ఐతే డింపుల్ హయతికి ఇదే చివరి అవకాశమని చెప్పొచ్చు. ఎందుకంటే కెరీర్ ఏమాత్రం ఆశాజనకంగా లేని ఈ టైంలో రవితేజతో సినిమా ఆమెకు మంచి ఛాన్స్ అని చెప్పొచ్చు. మరి ఈ సినిమాతో అయినా డింపుల్ తన లక్ కలిసి వచ్చేలా చేసుకుంటుందా లేదా అన్నది చూడాలి. డింపుల్ హయతి గుడ్ లుకింగ్స్‌తో పాటు యాక్టింగ్ టాలెంట్ ఉన్నా కూడా సరైన అవకాశాలు రావట్లేదు. ఐతే భర్త మహాశయులకు విజ్ఞప్తి ఆమె ఫేట్ మారుతుందా లేదా అన్నది చూడాలి. హీరోయిన్‌గానే కాదు సినిమాల్లో ఎలాంటి టఫ్ ఛాన్స్ వచ్చినా చేసేస్తా అంటుంది అమ్మడు. భర్త మహాశయులకు విజ్ఞప్తి ఒక గొప్ప అవకాశమని.. డింపుల్ హయతికి భర్త మహాశయులకు విజ్ఞప్తి ఒక గొప్ప అవకాశమని చెప్పొచ్చు. మరి ఈ టైంలో అమ్మడు ప్రూవ్ చేసుకుంటుందా లేదా అన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది. తెలుగు సినిమాల్లో టాలెంట్ ఉన్న తెలుగు భామలకు అవకాశాలు రావట్లేదని అంటుంటారు. ఐతే ఆ లిస్ట్‌లో డింపుల్ కూడా ఉంది. రవితేజలాంటి స్టార్ సినిమాల్లో ఛాన్స్‌లు వచ్చినా అమ్మడికి అసలేమాత్రం లక్ కలిసి రావట్లేదు. మరి అమ్మడు ఈసారి సంక్రాంతి సినిమాతో హిట్ ట్రాక్ ఎక్కుతుందేమో చూడాలి. రవితేజ కూడా మాస్ జాతర సినిమా నిరాశపరచడంతో భర్త మహాశయులకు విజ్ఞప్తితో ఎలాగైనా హిట్ కొట్టాలని చూస్తున్నాడు. ఈ సినిమాలో మాస్ అంశాలు పక్కన పెట్టి కంప్లీట్ ఎంటర్టైనర్ మోడ్‌లో వస్తున్నాడు రవితేజ. డైరెక్టర్ కిషోర్ తిరుమల సినిమాలు అన్నీ చాలా సెన్సిబుల్‌గా కూల్ అండ్ ఎంగేజింగ్‌గా ఉంటాయి. మరి భర్త మహాశయులకు విజ్ఞప్తి డైరెక్టర్, హీరో కాంబినేషన్‌ని సంథింగ్ స్పెషల్ అనిపించేలా చేస్తుందా లేదా అన్నది చూడాలి.

# ఫ్యాన్స్ 'అతి' ప్రేమపై సమంత, నిధి రియాక్షన్.. ఏమన్నారంటే..





స్టార్ హీరోయిన్లు పబ్లిక్‌లోకి వచ్చినప్పుడు ఫ్యాన్స్ ఎగబడటం, తోపులాట జరగడం ఈ మధ్య కామన్ అయిపోయింది. రీసెంట్ గా జరిగిన రెండు వేర్వేరు ఘటనల్లో స్టార్ హీరోయిన్లు సమంత, నిధి అగర్వాల్ ఇలాంటి పరిస్థితులనే ఎదుర్కొన్నారు. అయితే ఇద్దరూ కూడా ఫ్యాన్స్ విషయంలో చాలా మెచ్యూర్డ్‌గా ఆలోచించి, వారిపై కోప్పడకుండా చాలా పాజిటివ్‌గా రియాక్ట్ అవ్వడం ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. ముందుగా సమంత వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్‌లో ఆమెను ఫ్యాన్స్ చుట్టుముట్టిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. ఆమె సేఫ్టీ గురించి అందరూ కంగారు పడ్డారు. కానీ సమంత మాత్రం ఇందులో పానిక్ అవ్వాల్సిన అవసరం లేదని, ఫ్యాన్స్ కేవలం హలో చెప్పడానికి, ఫోటోల కోసమే వస్తారు తప్ప హాని చేయరని చాలా కూల్‌గా క్లారిటీ ఇచ్చారు. తనకు హైదరాబాద్, ముంబైలో పూర్తి రక్షణ ఉందని ఆమె చెప్పుకొచ్చారు.

ఇదే సమయంలో సమంత 2025 గురించి చెప్పిన విషయాలు మాత్రం సెన్సేషనల్‌గా ఉన్నాయి. ఈ వీడియో నేపథ్యంలో మాట్లాడుతూనే.. 2025 తన జీవితాన్ని మార్చేసిందని, ముఖ్యంగా తాను పెళ్లి చేసుకున్నానని మరో క్లారిటీ ఇచ్చారు. ఇది తన లైఫ్‌లో జరిగిన బెస్ట్ థింగ్ అని, అలాగే నిర్మాతగా మారి సొంత సినిమా తీయడం కూడా తనను కొత్త మనిషిగా మార్చిందని ఆమె ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మరోవైపు 'రాజా సాబ్' బ్యూటీ నిధి అగర్వాల్ పరిస్థితి కూడా దాదాపు ఇలాగే ఉంది. ఆమె రీసెంట్ గా బయటకు వచ్చినప్పుడు ఫ్యాన్స్ కొంచెం అతిగా ప్రవర్తించారు. ఆ తోపులాటలో ఆమె చాలా ఇబ్బంది పడినట్లు, ఫ్యాన్స్ బ్రూటల్ బిహేవియర్ పట్ల అన్ ఈజీగా ఫీల్ అయినట్లు తెలిసింది. ఆ వీడియోలు చూసిన వారు ఎవరైనా సరే, ఆ పరిస్థితిలో కచ్చితంగా సీరియస్ అవుతారు. అయితే నిధి అగర్వాల్ మాత్రం ఆశ్చర్యకరమైన నిర్ణయం తీసుకున్నారు. తనను ఫ్యాన్స్ అంత ఇబ్బంది పెట్టినా సరే, వారిపై కేసు పెట్టడానికి లేదా పోలీసులకు కంప్లైంట్ ఇవ్వడానికి ఆమె నిరాకరించారు. వారిది అభిమానమే తప్ప, ఉద్దేశపూర్వకంగా చేసింది కాదని భావించి ఆమె ఫిర్యాదు చేయడానికి ఒప్పుకోలేదట. జరిగిన దాన్ని వదిలేయడం ఆమె సహనానికి నిదర్శనం. అటు సమంత, ఇటు నిధి.. ఇద్దరూ కూడా అభిమానుల అత్యుత్సాహాన్ని మంచి మనసుతో సీరియస్ కాకుండా సింపుల్ గా వదిలేశారు. సమంత ఏకంగా తనకు ఎలాంటి భయం లేదని చెప్పగా, నిధి ఏకంగా కంప్లైంట్ వద్దని చెప్పి పెద్ద మనసు చాటుకున్నారు. స్టార్స్ ఇంత ఓపికగా ఉన్నప్పుడు, ఫ్యాన్స్ కూడా వారి పర్సనల్ స్పేస్‌ని గౌరవిస్తే బాగుంటుందని నెటిజన్లు అభిప్రాయపడుతున్నారు.

# మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలి అంటూ ధర్నా



**మక్కువ, (రాజధాని వార్తలు):** మండల కేంద్రం మక్కువ ఎంపీడీవో ఆఫీస్ వద్ద ధర్నా చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన వి బి జి రాంజీ నూతన గ్రామీణ ఉపాధి హామీ పథకం రద్దు చేసి పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఈరోజు ఎంపీడీవో ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. అనంతరం ఏపీవో ఈశ్వరమ్మ డిప్యూటీ ఎంపీడీవో సూర్యనారాయణకు మెమోరాండం సమర్పించడం జరిగింది. రైతు కూలి సంఘం (ఆం.ప్ర) జిల్లా ఉపాధ్యక్షులు పీడిక అసిరి మాట్లాడుతూ 2005లో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో పేదరికాన్ని, వలసలను అరికట్ట డానికి అందరికీ ఉపాధి గ్యారెంటీ చేస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని తీసుకు వచ్చిందని దీనికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం 10% నిధులను కేటాయిస్తుందని అన్నారు. కానీ రాను రాను ఈ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నిధులను తగ్గించే వేస్తున్నదని ఇప్పుడు పూర్తిగా ఆ పథకాన్ని ఎత్తివేసే కుట్రతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం స్థానంలో వికసిత్ భారత్ జి రాంజీ పథకాన్ని తీసుకు వచ్చిందని అన్నారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం కేవలం 60 శాతం నిధులను మాత్రమే కేటాయిస్తుందని మిగిలినది రాష్ట్ర ప్రభుత్వం భరించాలని మార్పులు చేశారు. దీనివలన గ్రామీణ ఉపాధి హామీ పథకం పూర్తిగా ఎత్తివేసే పరిస్థితి వస్తుందని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని ఆ పథకానికి నిధులను కేంద్ర ప్రభుత్వమే పూర్తిగా సమకూర్చాలని అలాగే పెండింగ్లో ఉన్న ఉపాధి హామీ కూలీల పాత బకాయిలను తక్షణమే విడుదల చేయాలని అన్నారు. పై విషయమై మెమోరాండంను సమర్పించారు. అనంతరం ఏపీవో మాట్లాడుతూ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకుల మర్రి బుగిలమ్మ, ఎం ప్రసాద్, బొండపల్లి వెంకటి, సీతయ్య, తౌడు, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

# యేసు ప్రభువు త్యాగం ఆదర్శనీయం

## - క్రిస్మస్ వేడుకలలో జిల్లా కలెక్టర్ రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** యేసు ప్రభువు త్యాగం అందరికీ ఆదర్శనీయమని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కొనియాడారు. సాటి మనుషుల పట్ల ఆయన చూపి ప్రేమ, కరుణ అనుసరణీయమని పేర్కొన్నారు. జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఆడిటోరియంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన సెమి క్రిస్మస్ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సుమారు 2 వేల ఏళ్ల క్రితమే దైవదూతగా వచ్చిన యేసు, త్యాగం, ప్రేమ, కరుణలతో ప్రజలందరికీ ఒక మార్గం చూపారని తెలిపారు. తనకు హాని చేయడానికి వచ్చిన వారిని, పాపులను కూడా క్షమించడం, ఆయన క్షమాగుణానికి నిదర్శనమని అన్నారు. ఆయన చూపిన మార్గం స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు మాట్లాడుతూ, క్రైస్తవ సోదరులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మైనారిటీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఫాస్టర్లకు, మౌజాంలకు పారితోషకాన్ని ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసిందని, త్వరలో వారి ఖాతాల్లో జమ అవుతాయని చెప్పారు. ఎంఎల్సి ఇందుకూరి రఘురాజు మాట్లాడుతూ, తమ కోసమే కాకుండా ఇతరుల కోసం కూడా ప్రార్ధనలు చేసే గొప్ప మనసు క్రైస్తవుల సొంతమని అభినందించారు. మన దేశంలో



క్రిష్టియన్లు మైనారిటీ అయినప్పటికీ, ప్రపంచంలో వారు మెజారిటి మతమని అన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమశాఖ ఈడి షేక్ మహబూబ్ షరీఫ్, క్రిష్టియన్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ పి. ప్రేమానందం, రెవరెండ్ పిల్లా ఆనంద్‌బాబు, రెవరెండ్ ఎస్.మధుతోపాటు పలువురు క్రైస్తవ ప్రతినిధులు మాట్లాడుతూ తమ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. ఈ సందరరేగా నిర్వహించిన ప్రత్యేక ప్రార్ధనల్లో అతిధులు పాల్గొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

# దుర్గా విద్యుత్ నగర్ ఝాన్సీ లక్ష్మీబాయ్ పార్కు నగరానికి ఆదర్శం

## - ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలోని దుర్గావిద్యుత్ నగర్‌లో గల ఝాన్సీ లక్ష్మీబాయ్ పార్కు నగరంలోనే అన్ని పార్కుల కంటే ఆదర్శంగా నిలుస్తోందని నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ తెలిపారు. మంగళవారం ఉదయం ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ దుర్గా విద్యుత్ నగర్ ప్రాంతంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా దుర్గావిద్యుత్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కాలనీలోని ప్రధాన డ్రైనేజీ సమస్యలు, పల్లంగా ఉన్న రోడ్లను ఎత్తు చేయాల్సిన అవసరం తదితర సమస్యలను ఆయన దృష్టికి తీసుకు వచ్చారు. అనంతరం కాలనీలోని ఝాన్సీ లక్ష్మీబాయ్ పార్కును ఇన్‌చార్జ్ కమిషనర్ సందర్శించారు. ఈ పార్కును దుర్గావిద్యుత్ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శ్రమదానంతో, స్వయం వనరులతో అభివృద్ధి చేసిన విధానాన్ని నాడు-నేడు ఫ్లెక్సీల ద్వారా వివరించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ మాట్లాడుతూ, దుర్గావిద్యుత్ నగర్‌లోని ఝాన్సీ లక్ష్మీబాయ్ పార్కు కాకినాడ నగరానికి ఆదర్శ పార్కుగా నిలుస్తోందన్నారు. నగరంలోని ఇతర రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు కూడా తమ ప్రాంతాల్లోని పార్కులను ఇదే విధంగా అభివృద్ధి చేసుకుంటే నగర సౌందర్యం మరింత మెరుగుపడుతుందన్నారు. ఈ కార్య



క్రమంలో దుర్గావిద్యుత్ నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి మూర్తి మాట్లాడుతూ, ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నగరంలో స్పష్టమైన మార్పు కనిపిస్తోందని అన్నారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, ఎస్.ఇ. వెంకట్రావు, డీసీపీ కృష్ణారావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, ఈఈ కనకరావు, ఏసీపీ శ్రీధర్, శానిటేషన్ ఇన్స్పెక్టర్ దుర్గారావు, సచివాలయ సిబ్బంది, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# "రబీ"కి ప్రణాళికయుతంగా సిద్ధంకండి : జిల్లా వ్యవసాయ అధికారి రామారావు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాబోయే రబీ సీజన్‌కు వ్యవసాయ అధికారులు ప్రణాళికాయుతంగా సిద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి వి.టి.రామారావు అన్నారు. మంగళవారం గజపతినగరం రైతు సేవ కేంద్రంలో జిల్లా వ్యవసాయ అధికారి రామారావు వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. రబీలో ఎరువులు సరఫరా, ఈ - పంట నమోదు, వ్యవసాయ యంత్ర పరికరాలు సర్వే, రబీ పంటల సాగు వివరాలు, తదితర అంశాలపై సమీక్ష చేపట్టారు. సహాయ వ్యవసాయ సంచాలకులు నిర్మల జ్యోతి, గజపతినగరం సబ్ డివిజన్లోని గజపతినగరం దత్తి రాజేరు, బొండపల్లి, మెంటాడ మండలాల వ్యవసాయ అధికారులు, ఉద్యానవన శాఖ సహాయకులు, పాల్గొన్నారు.

# సైబర్ క్రైమ్, ట్రాఫిక్ రూల్స్ హెల్మెట్ వాడకం పైన అవగాహన కల్పించిన ట్రాఫిక్ పోలీసులు



**కాకినాడ టౌన్, (రాజధాని వార్తలు):** ది.23.12.2025వ తేదీన కాకినాడ టౌన్ హల్ సెంటర్ నందు వాహనదారులకు మరియు పాదచారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించిన కాకినాడ ట్రాఫిక్ పోలీసులు. మోటార్ సైకిల్స్ నడిపే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్/ ధరించాలని ట్రిపుల్ రైడింగ్, బైక్ స్టంట్స్, మైనర్ డ్రైవింగ్ చేయరాదని, రాష్ అండ్ నెగ్లిజెన్స్‌గా డ్రైవ్ చేయరాదని, మాడిఫైడ్ సైలెన్సర్లు వాడరాదని, సెల్ ఫోన్లో మాట్లాడుతు డ్రైవింగ్ చేయొద్దని, ట్రాఫిక్ రూల్స్ తప్పనిసరిగా అందరు పాటించాలని మోటార్ వాహనాలు కలిగిన ప్రతి ఒక్కరూ గవర్నమెంట్ వారు జారీ చేసిన నంబర్ ప్లేట్లను మాత్రమే వాడాలని అవగాహన కల్పించారు. సైబర్ నేరలలో భాగముగా ఆన్లైన్ మోసాలు, ఫేక్ లోన్స్ మోసాలు, ఆన్లైన్ జాబ్స్/వర్క్, డిజిటల్ అరెస్టు 112/ 100, 1930, 1972 కాల్స్ యొక్క ఉపయోగములు గురించి వివరించినారు. సదరు అవగాహన కార్యక్రమంపై వాహనదారులు, పాదచారులు కాకినాడ పోలీసు వారికి హర్షధ్వానాలతో అభినందనలు తెలియజేసినారు. ఈ కార్యక్రమం నందు ట్రాఫిక్-1 ఇన్స్పెక్టర్ రమేష్, మరియు ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ధనుర్మాస ప్రసాద వితరణ





**కాకినాడ, (రాజధాని వార్తలు):** శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణు గోపాల స్వామివారి దేవస్థానం దేవాలయం వీధి కాకినాడ ప్రసాద వితరణ 17.12.25 నుంచి 14.1.2026 వరకు ఉదయం 7-30 నుంచి 9 గంటల వరకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దేవస్థానం కమిటీ సభ్యులు ధనుర్మాస ప్రసాద వితరణ చేశారు.

సేవకులు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దీవెనలు పండితుల ఆచార్య వచనాలు తీసుకున్నారు.

# జనవరి 26న సంస్థ 9వ వార్షికోత్సవం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద సేవ సంస్థ 9 వార్షికోత్సవం పత్రిక ఆవిష్కరణ సామర్లకోట స్థానిక బళ్ళ మార్కెట్ సెంటర్లోని సర్వేజనా సుఖినోభవంతు స్వఛరేద సేవా సంస్థ కార్యాలయంలో ప్రముఖ వ్యాపారవేత్త కటకం రాంబాబు చేతుల మీదుగా మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ఫౌండర్ అండ్ చైర్మన్ కాపవరపు కుమార్ (కేకే) మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు స్థాపించి తొమ్మిది సంవత్సరాలు అయ్యి పదో సంవత్సరంలోకి అడుగు పెడుతున్న శుభ సందర్భంగా నైన్త్ యానివర్స్ డే వేడుక జనవరి 26న సామర్లకోట పట్టణం బళ్ళ మార్కెట్ సెంటర్‌లోని తమ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ సంస్థ ద్వారా అనేక సాంఘిక సేవా కార్యక్రమాలు చేయడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. ఈ సంస్థ ద్వారా మరిన్ని కార్యక్రమాలు చేయాలని ప్రజలకు, సమా జానికి ఒక శ్రేయోభిలాషులా ఉండాలని ఈ సంస్థను ఏర్పాటు చేయడం జరిగిందని కుమార్ అన్నారు. కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్స్ అడబాల వీరభద్రరావు, సర్వేజనా సుఖినోభవంతు స్వచ్ఛంద



సేవా సంస్థనే సంస్థ ద్వారాగా మేము ఈ కార్యక్ర మాలు చేయడానికి చేస్తున్నందుకు మేము చాలా సంతోషపడుతున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఆర్గనైజర్లు అడబాల ప్రసాదరావు, డాక్టర్ పి.సత్యనారాయణ మాట్లాడగా ముఖ్య అతిధి కటకం రాంబాబు మాట్లాడుతూ సర్వేజనా సుఖినోభవంతు అంటే సర్వజనులు సంతోషంగా ఆరోగ్యంగా సమాజం ప్రకృతి సహస్ర సిద్ధంగా ఉండే విధంగా ఉండాలని ఈ సర్వేజనా సుఖినోభవంతు ముఖ్య ఉద్దేశం అని పంచభూతాలు ఆరోగ్యం ఉంటే మనమందరం ఆరోగ్యంగా ఉంటామన్నారు.

# కాకినాడలో కార్పొరేషన్ సామాజిక స్థలాల పరిరక్షణకు చర్యలు

## - దుర్గా విద్యుత్ నగర్లో నోటీసు బోర్డు ఏర్పాటు




**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలాలను పరిరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నగర పాలక సంస్థ ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ తెలిపారు. మంగళవారం నగరంలోని దుర్గా విద్యుత్ నగర్లో ఉన్న కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలంలో అధికారులు నోటీసు బోర్డును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతాన్ని ఇన్‌చార్జ్ కమిషనర్ ఎన్.వి.వి.సత్యనారాయణ సందర్శించారు. ఆయన మాట్లాడుతూ, నగర పరిధిలో కార్పొరేషన్‌కు చెందిన సామాజిక స్థలాలను అక్రమ ఆక్రమణల నుంచి కాపాడేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఆయా స్థలాల్లో స్పష్టంగా నోటీసు బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, సూపరింటెండింగ్ ఇంజనీర్ పి.వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృధ్వీచరణ్, డిసిపి కృష్ణారావు, ఏసిపి శ్రీధర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వర్గీకరణ చేసిన పార్టీలకు బుద్ధి చెబుతాం

## - అన్న పివి రావుకు ఘన నివాళి - మాలల అభ్యున్నతికే తన జీవితాన్ని ధారబోసిన త్యాగమూర్తి అన్న పివి రావు

## - ఎస్‌సి వర్గీకరణ చేసి దళితులను విభజించి పరిపాలించాలనే కుట్రను తిప్పికొడతాం

**అమలాపురం, (రాజధాని వార్తలు):** మాలలను అణిచివేయాలనే కుట్రతో వెనకుండి ఎస్సీ వర్గీకరణ చేపట్టిన పార్టీలకు బుద్ధి చెబుతామంటూ మాలమహానాడు నేతలు హెచ్చరించారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా మాల మహానాడు ఆధ్వర్యంలో మాల మహానాడు వ్యవస్థాపక అధ్యక్షుడు స్వర్గీయ అన్న పి.వి.రావు 20వ వర్ధంతి సభ అమలాపురం గడియార స్తంభం సెంటర్లో ఘనంగా నిర్వహించారు. మాలల అభ్యున్నతికే తన జీవితాన్ని ధారబోసిన త్యాగమూర్తి అన్న పివి రావు అని మాల మహానాడు నేతలు పివి రావుకు ఘనంగా నివాళులు అర్పించి కొనియాడారు. ఎస్సీ వర్గీకరణ చేసి దళితులను విభజించి పరిపాలించాలనే కుట్రను తిప్పికొడతామన్నారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎస్సీ వర్గీకరణ చేసిన పార్టీలకు బుద్ధి చెబుతామంటూ హెచ్చరించారు. అవసరమైతే ఉమ్మడి ఉద్యమాలు చేసి హక్కులను సాధించుకుంటామన్నారు. మాలల హక్కులను కాలరాసి అణగదొక్కాలని చూసే ఏ పార్టీకైనా బుద్ధి చెబుతామని హెచ్చరించారు. స్వర్గీయ అన్న పీవీ రావు ఘాట్ నిర్మాణంలో అన్ని రాజకీయ



పార్టీలు ఆయా రాజకీయ పార్టీలలో గెలిచిన మాల ఎమ్మెల్యేలు, ఎంపీలు విఫలం అయ్యారని మండిపడ్డారు. వర్ధంతి సభకు ముఖ్య అతిథులుగా రాజ్యాంగ రక్షణ దళ్ వ్యవస్థాపకులు షాన్ రెంజర్ల రాజేష్ మాట్లా డుతూ మాలలను అణగదొక్కాలనే రాజకీయ కుట్రతోనే కొన్ని పార్టీలు ఎస్సీ వర్గీకరణ చేపట్టాయని మండిపడ్డారు. రాజ్యాంగం ద్వారా ఉన్న హక్కులను కాలరాసేందుకు దళితులను విభజించి రాజ్యాంగ స్ఫూర్తికి తూట్లు పొడుస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బాబాసాహెబ్ అంబేద్కర్ బీసీలకు అధిక శాతం రిజర్వేషన్ కల్పించినా, అన్ని కులాల, వర్గాల మహిళలకు ఎన్నో హక్కులను రాజ్యాంగం ద్వారా కల్పిస్తే నేడు బాబాసాహెబ్ అంబేద్కర్‌ను మాల మాదిగల నాయకుడుగానే చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

భారతదేశానికి గొప్ప రాజ్యాంగ అందించి ప్రతి మనిషికి స్వేచ్ఛ, సమానత్వం, భావ ప్రకటన, ఓటు హక్కు ఇలా ఎన్నో హక్కులను రాజ్యాంగం ద్వారా అందించిన మహెూ న్నతుడు అంబేద్కర్‌ను నేటికి దళితుల నాయకుడు గాని చూస్తు న్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దళితులు బీసీలు కళ్ళు తెరిచి రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ పండుల రవీంద్ర బాబు, రిటైర్డ్ ఐ ఆర్ ఎస్ అధికారి టి ఎస్ ఎన్ మూర్తి, పెయ్యల పరశురాముడు, డిబి లోక్, నాతి శ్రీనివాసరావు, జల్లి శ్రీనివాసరావు, పెయ్యల శ్రీనివాసరావు, పండు అశోక్ కుమార్, ఇసుకపట్ల రఘుబాబు, జంగా బాబురావు, గుమ్మాపు సూర్య వరప్రసాద్, గెడ్డం సురేష్ బాబు, గిడ్ల వెంకటేశ్వరరావు, పెనుమాల చిట్టిబాబు, కుంచే రమణారావు, బొంతు మణి రాజు, చింతా రాజబాబు, వెన్నపు పెద్ద, ఉండ్రు బాబ్జి, నల్లా నరసింహమూర్తి, కొంకి వెంకట బాబ్జి, రేవు శ్రీను, పుణ్యమంతుల రజిని, కొంకి రాజామణి, పోతుల నాగరాజు, గన్నవరపు శ్రీనివాసరావు, కలిగితి పల్లం రాజు, భూపతి వెంకటపతి, నక్కా సంపత్, జక్కల అరుణ్ కుమార్, నూకపెయ్యి చిన్న, పినిపే జయరాజు, చింతా రామకృష్ణ, జక్కల ప్రసాద్, సాధనాల శ్రీను, యలమంచిలి బాలరాజు, కాశి రామ కృష్ణ, గెద్దాడ బుద్ధ రాజు, గెల్లా రాజేంద్ర, రేవు తిరుపతి రావు, గిడ్ల శ్యామ్, వెంటపల్లి మధు, పరమట రాం ప్రసాద్, దేవరపల్లి శాంతి కుమార్, కుంచే బాబులు, అయితాబత్తుల కృష్ణారావు, వడ్డే గౌతమ్, మెండి డేవిడ్ అంబేద్కర్, సాపే రమేష్, బూసి రాంబాబు, గిడ్ల వీర ప్రసాద్, కొంకి ఏడుకొండలు, నక్కా కృష్ణ, పోతుమూడి రవి, ఈతకోట నాగేశ్వర రావు, ముత్తాబత్తుల రమణ, ఉబ్బన శ్రీను, ఉటాల వెంకటేష్, మోకా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# 48 వార్డులో అభివృద్ధి పనులను పరిశీలించిన గంకల కవితా అప్పారావు యాదవ్

## - కాలువలు, డ్రైనేజీ, రోడ్లు, నూతన కమిటీ హాల్ నిర్మాణం పనులను పరిశీలించిన గంకల



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** జీవీఎంసీ 48వ వార్డు కొండవాలు ప్రాంతంలో జరుగుతున్న అభివృద్ధి పనులను 48వ వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, జీవీఎంసీ బీజేపీ ఫ్లోర్ లీడర్ గంకల కవిత అప్పారావు యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వార్డులో పలుచోట్ల జరుగుతున్న డ్రైనేజీలు, కాలువలు, రోడ్లు, కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను నేరుగా పరిశీలించారు. అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. పనులను పరిశీలించి అధికారులకు కాంట్రాక్టర్ కు పలు సూచనలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అభివృద్ధి పనులను పరిశీలించి వార్డులో దోమలు ఎక్కువగా ఉన్నాయని, సీజనల్ వ్యాధులు ప్రబలకొండ ఉండేందుకు మలేరియా డిపార్ట్మెంట్ అధికారులు కలిసి ఫాగింగ్ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గంకల కవిత అప్పారావు యాదవ్ మాట్లాడుతూ 48వ వార్డులో చేపడుతున్న గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ప్రజలు ఇచ్చిన వినతులను పరిశీలించి జీవీఎంసీ కౌన్సిల్లో చర్చించి జీవీఎంసీ మేయర్, కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి వార్డు ప్రజల సమస్యలను పరిష్కారం చేయడం జరుగు తుందని, ఇందులో భాగంగా వార్డులో గల కొండ ప్రాంతంలో డ్రైనేజీలు, కాలువలు, రోడ్లు, నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పలుచోట్ల కాలువలు, గెడ్డలు మరమ్మతులు జరగాయని ఆ విషయం తన దృష్టికి వచ్చిందని తక్షణమే జీఎంసీ కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని కోరడం జరిగిందని వాటిలో కొంతమేర అభివృద్ధి పనులు ప్రస్తుతం జరుగుతు న్నాయని, వార్డులో దోమలు ఎక్కువగా ఉన్నాయని గుడ్ మార్నింగ్ గంకల కార్యక్రమంలో ఫిర్యాదు అందిందని, సీజనల్ వ్యాధులు ప్రబలకొండ ఉండేందుకు మలేరియా డిపార్ట్మెంట్ అధికారులు కలిసి ఫాగింగ్ పనులు చేపట్టడం జరిగిందన్నారు. భవిష్యత్తులో వార్డులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని, వార్డు అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని గంకల కవితా అప్పారావు యాదవ్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా వార్డు అంతటా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించి ప్రజల నుంచి పలు వినతలను స్వీకరించి తక్షణమే ఫోన్‌లో అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు. ఈ వార్డు అభివృద్ధికు నిరంతరం అహర్నిశలు కృషి చేస్తున్న కార్పొరేటర్ గంకల కవితా అప్పారావు యాదవ్‌కు వార్డు ప్రజలు హర్షధ్వనులు తెలిపారు.

# లబ్ధిదారులకు గృహ స్వాధీన పత్రాలను పంపిణీ చేసిన డాక్టర్ కందుల




**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద సబ్బవరం మండలం గంగవరం ప్రాం తంలో ఎన్టీఆర్ కాలనీకి సంబంధించి 46 మంది లబ్ధిదారులకు గృహ స్వాధీన పత్రాలను విశాఖ దక్షిణ నియోజకవర్గం జనసేన పార్టీ నాయకులు, 32వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ కందుల నాగరాజు అందజేశారు. అల్లిపురం నేరెళ్ల కోనేరు డాక్టర్ కందుల నాగరాజు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సం దర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరి సొంతింటి కల నిజం చేయాలని కోటి సర్కార్ తీసుకున్న నిర్ణయం మేరకు నేడు 46 మంది లబ్ధిదారులకు ఇంటి పట్టాలను అందజేయడం జరి గింది అన్నారు. అర్హులైన వారందరికీ ప్రభుత్వం సొంత ఇంటి కల నిజం చేయడంలో ముందుందని తెలియజేశారు. ప్రభుత్వం ఎప్పుడు ప్రజల పక్షానే ఉంటుందని పేర్కొన్నారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వరుసగా ప్రజా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహిస్తూ వస్తుందని వెల్లడించారు. ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం ఎన్నో పథకాలను అమలు చేస్తుందని చెప్పారు. గత వైసిపి ప్రభుత్వంతో పోలిస్తే నేటి ఎక్కువగా ప్రభుత్వం ప్రజలకు ఎక్కువగా మంచి చేస్తుందని తెలిపారు. పార్టీలు కచ్చితంగా అన్ని వర్గాలకు చేయూతనందిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధి వేగవంతంగా జరుగుతుందని వెల్లడించారు. ఈ క్రమంలో విశాఖ అభివృద్ధి కూడా జోరందుకుందని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలో ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. 32వ వార్డు అభివృద్ధికి కూడా తన పూర్తి సహాయ సహకారాలు అందజేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎం.ఎం.నాయుడు, రాజశేఖర్, కృష్ణమూర్తి, కేదార్ లక్ష్మి, ఎంఎల్ఎన్ రావు, వెంకట్ లక్ష్మి, కృష్ణ కే.అప్పారావు, వై.ఆదిబాబు, సిపిఐ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

# పూర్ణ మార్కెట్ అగ్నిప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి బాధితులకు భరోసాను కల్పించిన జీవీఎంసీ కమిషనర్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పూర్ణ మార్కెట్‌లో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించి బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన సోమవారం అర్ధరాత్రి విశాఖపట్నం పూర్ణ మార్కెట్ లో జరిగిన అగ్ని ప్రమాద ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జీవీఎంసీ కమిషనర్ పూర్ణ మార్కెట్లో అగ్ని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించి, దుకాణాలు ఇంకా అక్కడక్కడ కాలుచుండడం గమనించి వెంటనే జిల్లా అగ్నిమాపక అధికారితో మాట్లాడి ఫైర్ ఇంజన్ తో మిగిలిన మంటలను ఆర్పే ఏర్పాట్లను చేశారు. అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతంలో పేరుకుపోయిన వ్యర్థాలను యుద్ధ ప్రాతిపాదికన తొలగించే ప్రక్రియ ప్రారంభించాలని జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడు ను ఆదేశించారు. అనంతరం అగ్ని ప్రమాదంలో కాలిపోయిన 15 దుకాణాల బాధితులను ఓదారుస్తూ వారికి భరోసాను కల్పించారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి అన్ని విధాల న్యాయం



జరిగేలా తగిన చర్యలు చేపడతామని బాధితులకు భరోసాను కల్పించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ కార్య నిర్వాహక ఇంజనీరు వెంకటేశ్వరరావు, జీవీఎంసీ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్ సంస్థలకు ప్రభుత్వ భూములు దారాదత్తం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ప్రస్తుతం రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆరోపించారు. ప్రజా సంక్షేమం గాలికి వదిలేసి కూటమి నేతలు తమ స్వప్రయోజనాల కోసం పనిచేస్తున్నారని దుయ్యబట్టారు. విశాఖలో విలువైన భూములను కార్పొరేట్ సంస్థలకు అప్పనంగా అప్పగిస్తున్నారని విమర్శించారు. ఆసీల్ మెట్ట పార్టీ కార్యాలయంలో మంగళవారం సుమారు వందమంది ఆయన సమక్షంలో వైసీపీలోకి చేరడం జరిగింది. ఈ సందర్భంగా వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత వైద్యం అందించాలని అప్పటి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి మెడికల్ కాలేజ్‌ల ఏర్పాటుకు కృషి చేస్తే నేటి కూటమి సర్కార్ ఆ కాలేజీలను ప్రైవేటు సంస్థలకు అప్పజెప్పడం పట్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి వ్యతిరేకత వస్తుందన్నారు. పేద ప్రజలకు ఉచిత వైద్యాన్ని కూటమి సర్కార్ దూరం చేస్తుందని ఆరోపించారు. ప్రజా సమస్యలను పట్టించుకోకుండా కూటమి నేతలు వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. జగన్మోహన్ రెడ్డి తోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. వచ్చే ఎన్నికల తర్వాత కచ్చితంగా వైసీపీ అధికారం చేపడుతుందని వెల్లడించారు.

**వైసీపీలో వంద మంది చేరిక**



30వ వార్డ్ ప్రెసిడెంట్ దశమంతలు మాణిక్యాలరావు ఆధ్వర్యంలో విశాఖ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త మాజీ శాసనసభ్యులు వాసుపల్లి గణేష్ కుమార్ సమక్షంలో 30 వ వార్డు మీద రెల్లి వీధి ప్రాంతం నుండి టీడీపీ నాయకురాలు యార్ణమ్మతో సహా వంద మంది వైస్సార్సీపీలోకి చేరారు. ఈ కార్యక్రమంలో స్టేట్ ఆర్ టి ఐ సెక్రటరీ దస్మాంతుల చిన్ని, జిల్లా ఆర్టిఐ ప్రెసిడెంట్ వడ్డాది దిలీప్, జిల్లా ఎస్సీ సెల్ వైస్ ప్రెసిడెంట్ కోన శంకర్, సౌత్ మహిళా ప్రెసిడెంట్ వాసుపల్లి బంగారమ్మ, వార్డు ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ సంతోషి, బంగారు బాబ్జి, వేణు, రమేష్, సౌత్ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆకుల యెషు, గౌస్, గోవింద్ రాజ్, నారాయణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# జీడి రైతులకు మేలు చేద్దాం

## - గొర్రెలు పెంపకం దారులను ప్రోత్సహిద్దాం : అనకాపల్లి జిల్లా డిహెచ్‌ఒ ఎ.రాజశేఖర్

**అనకాపల్లి, (రాజధాని వార్తలు):** జీడి రైతులకు మేలు చేద్దాం అని అనకాపల్లి జిల్లా ఉద్యానవన అధికారి ఎ.రాజశేఖర్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం అనకాపల్లి జిల్లా కోటవురట్ల మండలం శ్రీరాంపురం గ్రామంలో జాతీయ రైతుల దినోత్సవం సందర్భంగా సిఫా ట్రస్ట్ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గొర్రెలు పెంపకందారులను ప్రోత్సహిద్దాం అన్నారు. పాలు ప్రభుత్వ పథకాలను వివరించారు. ఆర్గానిక్ గా పండిస్తున్న పంటలకు గిట్టుబాటు ధర లభించడం కోసం నిర్వహించవలసిన విధానాన్ని వివరించారు. సిఫా ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన పురాతన విత్తనాల ఎగ్జిబిషన్, ఉత్తమ రైతులకు సన్మానించిన తీరు అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్ర యూనివర్సిటీ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం వి రాజు, వ్యవసాయ శాఖ అధికారులు ప్రసాద్, మోహన్,



సరోజిని, గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం జిల్లా అధ్యక్షులు దాట్ల సుబ్రహ్మణ్య వర్మ, సంకల్ప ఆర్ట్ విలేజ్ ప్రతినిధి ఆకుల చలపతి రావు, సిఫా ట్రస్ట్ సిఇఒ డాక్టర్ శశిప్రభ ఎఫ్ పి ఒ సిఇఒ రామలక్ష్మి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్ జి ఒ వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం తదితరులు మాట్లాడారు. కోటవురట్ల, లమ్మసింగి, దౌనూరు గ్రామాల కు చెందిన ఆదివాసీ లు, ఆదిమ ఆదివాసీలు, దళిత రైతులు పాల్గొన్నారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో ముగ్గురికి జైలు శిక్ష

**గజపతినగరం, (రాజధాని వార్తలు):** డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ ముగ్గురికి మేజిస్ట్రేట్ జైలు శిక్ష విధించినట్లు ఎస్సై కే.కిరణ్ కుమార్ నాయుడు తెలిపారు. ఆయన అందించిన వివరాలు ప్రకారం గత రెండు రోజులుగా హైవే పై పోలీసులు చేపట్టిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ముగ్గురు వ్యక్తులు పట్టుబడగా వారికి పరీక్షలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. అనంతరం కోర్టులో హాజరు పరిచారు.

మూడు కేసుల్లో ముద్దాయిలైన లారీ డ్రైవర్ వకీల్ యాదవ్‌కు 14 రోజులు, మోటార్ సైకిల్ డ్రైవర్ వడ్డీపల్లి యువరాజు, మరో మోటార్ సైకిల్ డ్రైవర్ లండ రామారావులకు వారం రోజులు పాటు జైలు శిక్ష విధిస్తూ గజపతినగరం మెజి స్ట్రేట్ ఏ.విజయ రాజ్ కుమార్ తీర్పు చెప్పినట్లు పేర్కొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call
9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ అఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్:1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ బి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎవ్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిన్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# 5వ జోన్ లో జనవరి 7న బహిరంగ వేలం నిర్వహణ : జివిఎంసి జోనల్ కమిషనర్ బి. రాము

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 5వ జోన్ పరిధిలోని ఖాళీగా ఉన్న దుకా ణాలు, కళ్యాణ మండపాలు, రోడ్ సైడ్ మార్కెట్లకు జనవరి 7వ తేదీన ఉదయం 11 గంటలకు 5వ జోన్ (జ్ఞానాపురం) జోనల్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించబడునని జోనల్ కమిషనర్ బి.రాము మంగళవారం పత్రికా ప్రకటన ద్వారా తెలియజేశారు. మహా విశాఖ నగర పాలక సంస్థ, జ్ఞానాపురం, జోన్-5, పరిధిలోని వార్డు నెం.40 నుండి 63 వరకు ఖాళీగా ఉన్న దుకాణాలు, కళ్యాణ మండపములు, రోడ్డు సైడ్ మార్కెట్లకు తేది 07-01-2026 ఉదయం 11.00 లకు జ్ఞానాపురంలో 5వ జోనల్ కార్యాలయము నందు దిగువ తెలిపిన వివరాలు ప్రకారం బహిరంగ వేలము నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. వార్డు నెం.60 లో గుల్లల పాలెం షాపింగ్ కాంప్లెక్స్ లో దుకాణము నెం. 22,23,24,28,46,47,57, అశోక్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణం నెంబర్ 03 మరియు ములగాడ షాపింగ్ కాంప్లెక్సులో దుకాణము నెం.03, ప్రకాష్ నగర్ షాపింగ్ కాంప్లెక్స్‌లో దుకాణము నెం.05, గుల్లల పాలెం హాకర్ జోన్ షాప్ లో బ్లాక్-ఎ లో 4,5,6,8,14,15,16,18,19 షాప్ లకు మరియు బ్లాక్-బి లో 21, 22, 23, 24, 25, 26, 27, 28, 29, 30, 31,32,33,34,35,36, 37,38 షాప్ లకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు అలాగే వార్డు నెం 51 (కొత్త వార్డు) లోని మాధవ స్వామి కళ్యాణ మండపం నకు మూడు సంవత్సరాల కాల పరిమితి వరకు, మార్కెట్లలో గుల్లలపాలెం దుకాణము రోడ్ పక్కన మార్కెట్లకు (హాకర్ మండలం) ఒక సంవత్సరం కాల పరిమితి వరకు వేలం పాట జరుగునని 5వ జోన్ జోనల్ కమిషనర్ తెలిపారు.

# అభివృద్ధి పనులు చేపట్టాలంటూ కలెక్టర్‌కు వినతి



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపాలిటీకి వచ్చిన నిధులు రూ. 1.45 కోట్లతో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేపట్టాలని, కౌన్సిల్ మధ్య ఉన్న విభేదాలను వీడాలని కోరుతూ జిల్లా మానవ హక్కుల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్కు వినతిపత్రం మున్సిపల్ కమిషనర్ ఏ శ్రీవిద్య ద్వారా అందించేందుకు వారు అందజేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ మాట్లాడుతూ సామర్లకోట మున్సిపాలిటీలో గత కొన్ని నెలలుగా చైర్ పర్సన్, వైసీపీ కౌన్సిలర్ల మధ్య విభేదాలు కారణంగా కుర్చీ కోసం పోట్లాడుకుంటూ పట్టణ అభివృద్ధిని గాలికి వదిలిపెట్టారన్నారు. వచ్చిన నిధులు ఉపయోగించకుంటే అవి తిరిగి వెనకకు వెళ్ళిపోయే ప్రమాదం ఉందన్నారు. కౌన్సిల్ మధ్య ఎలాంటి విభేదాలు ఉన్నప్పటికీ పట్టణ అభివృద్ధికి సంబంధించి చేపట్టాల్సిన పనులు విషయంలో కౌన్సిల్ సభ్యులు ఏక నిర్ణయానికి వచ్చి అవి జరిగేలా ఆమోదించాలన్నారు. దానికి మున్సిపల్ కమిషనర్ కౌన్సిల్‌తో చర్చలు జరపాలన్నారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు రానున్న నేపథ్యంలో తిరిగి ఓట్లు కోసం వార్డుల్లోకి వెళితే పార్టీలను ప్రజలు ప్రశ్నించే అవకాశం ఉందన్నారు. పార్టీలు, పదవులపై వ్యామోహాలను పక్కన పెట్టి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు జరిగే విధంగా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కుంచె నాని బాబు, తదితరులున్నారు.

# మహారాష్ట్రలో అలరించిన ప్రసాద్ నృత్య ప్రదర్శన



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** మహారాష్ట్ర ప్రముఖ పుణ్య క్షేత్రం షిరిడీ శ్రీ సాయి బాబా వారి ఆలయంలో ఇటీవల సామర్లకోటకు చెందిన ప్రముఖ కూచిపూడి నృత్యకారుడు అలమండ ప్రసాద్ చేసిన కూచిపూడి నృత్యం అందరినీ అలరించింది. హైదరాబాద్ శ్రీ నటరాజ కూచిపూడి డాన్స్ అకాడమీ, భద్రాద్రి సంస్కృతి వారధి భద్రాచలం సంయుక్త ఆధ్వర్యంలో షిరిడీ సాయి ఆలయంలో నృత్యకారుడు ప్రసాద్ కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి ఆకట్టుకు న్నారు. ఈ సందర్భంగా నృత్యకారుడు ప్రసాద్‌ను ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సచిన్ దివాకర్ తదితరులు అభినందించారు. ఈ సందర్భంగా తనకు ఈ అవకాశం ఇచ్చిన నృత్య గురువులు చల్లా కొండలరావు, తులసి, షిర్డీ సాయి ఆలయ బోర్డు మెంబర్ సచిన్ దివాకర్‌కు నృత్యకారుడు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన నృత్యకారుడు ప్రసాద్‌ను పలువురు అభినందించారు.

# కృత్రిమ అవయవాల గుర్తింపునకు 26న శిబిరం

**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కాకినాడ జిల్లా దివ్యాంగుల పునరావాస కేంద్రం నిర్వహణా సంస్థ అయిన ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 26వ తేదీ శుక్రవారం సామర్లకోట మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో దివ్యాంగుల కోసం అవసరమైన కృత్రిమ పరికరాలు కొరకు గుర్తింపు శిబిరం నిర్వహిస్తున్నట్టు ఎంపిడివో కె హిమ మహేశ్వరి తెలిపారు. మంగళవారం ఆమె ఒక ప్రకటనలో తెలుపుతూ ఈ శిబిరంలో ప్రధానంగా ఇప్పటికే దివ్యాంగులు వాడుతున్న పాత కృత్రిమ అవయవాలు, కాలిపర్స్‌కు మరమ్మత్తులు, కొత్త కృత్రిమ అవయవాల కోసం వ్యక్తిగత కొలతలు తీసుకోవడం, కొత్త కాలిపర్స్ కోసం కొలతలు తీసుకోవడం, వీల్చైర్, ట్రైసైకిల్స్ అవసరమైన వారిదగ్గర నుండి దరఖాస్తులు స్వీక రణ, వినికిడి లోపం కలిగిన వారిని పరీక్షించి హియరింగ్ ఎయిడ్స్ అందించేందుకు గానూ అవస రమైన వారి నుండి దరఖాస్తులు స్వీకరణ చేపట్ట నున్నట్టు తెలిపారు. ఈ శిభిరానికి హాజరు అయ్యే దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ, రేషన్ కార్డు జిరాక్స్ కాపీ, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, రెండు పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు తీసుకుని హాజరు కావాలాన్నారు. దీనికిగానూ గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది తమ పరిధిలోని అర్హులైన దివ్యాంగలను గుర్తించి, వారికి ఈ శిబిరం వివరాలు తెలియజేసి, ఈ నెల 26న జరిగే శిబిరానికి హాజరయ్యేలా ప్రోత్సహించి, అవసరమైన సహకారం అందించాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమం విజయ వంతానికి



మండల పరిధిలోని ప్రజలు పూర్తి సహకారం అందించాలని ఈ సందర్భంగా ఎంపిడివో హిమ మహేశ్వరి తెలిపారు.

# మాజీ ప్రధాని పివి నరసింహారావుకు కాంగ్రెస్ శ్రేణులు నివాళి



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** దేశ మాజీ ప్రధాని పివి నరసింహారావు వర్ధంతి సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కాండవ గాయత్రి ఆధ్వర్యంలో గవర్నర్ బంగ్లా దగ్గర ఉన్న ఆయన కాంశ్య విగ్రహానికి కాంగ్రెస్ శ్రేణులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా నాయకులు ఆయన పాలన దక్షితను, దేశాన్ని ఆర్థిక సంస్కారణాలతో పరుగులు పెట్టించిన విధానాన్ని కొనియాడారు. పీవీ బహు భాష కోవిదుడని అన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఇంచార్జ్ ప్రియాంక దండి, దక్షిణ నియోజకవర్గ ఇంచార్జ్ కేవీ సూర్యనారాయణ, సీనియర్ నాయకులు కస్తూరి వెంకటరావు, గుర్రం కనకరాజు, భోగవరపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan